
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
బుధవారం 17 సెప్టెంబరు 2025



మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ఇల్లంతకుంట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందించే మధ్యాహ్నభోజనంలో తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా సూచించారు. మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం పరిశీలించారు. మధ్యాహ్నభోజనాన్ని గ్యాస్‌స్టవ్‌పైనే తయారు చేయాలన్నారు. పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు, ఎంత మంది ఉపాధ్యాయులు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను సందర్శించి ఎల్‌ఈడీ ప్యానల్‌బోర్డుల వివరాలపై ఆరాతీశారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, సేవలందించడంలో నిర్లక్ష్యం చర్యలు తప్పవన్నారు. వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో అందించే సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, సుఖప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. ఆరోగ్యకేంద్రంలోని వార్డులను, విభాగాలను పరిశీలించి వివరాలు అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బోయిని తిరుపతి, వైద్యాధికారి ప్రేమ్‌కుమార్, హెచ్‌ఈవో వెంకటరమణలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

సామాన్యులు సైతం సాయుధులై..



- నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం
- త్యాగాలకు రాజన్న సిరిసిల్ల జిల్లా తలమానికం
- తెలంగాణ విమోచనం జ్ఞాపకాల్లో ప్రజానీకం..
- నేడు 'ప్రజాపాలన దినోత్సవం'గా వేడుకలు
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

తెలంగాణ విమోచన పోరాటం.. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాగిన మహోజ్వల ఉద్యమం.. నాజీలను మించిన నిజాం సైన్యాలు, రజాకారులు పల్లెల్లో జరిపిన అకృత్యాలు, నిరంకుశత్వానికి వెల్లువెత్తిన తిరుగుబాటు బావుటా... బాంచెన్ నీ కాల్మొక్తం.. అంటూ మోకరిల్లిన తెలంగాణ.. సామాన్యులే సాయుధులై సాగించిన రణంలో రాజన్న సిరిసిల్ల జిల్లా అగ్రభాగాన నిలిచింది. సాయుధ పోరులో జిల్లాకున్న ప్రాముఖ్యతను ప్రాణాలు వదిలిన వారి చరిత్రలే చెబుతాయి. నైజాంకు వ్యతిరేకంగా అనేక వ్యూహాలు, ఆయుధ శిక్షణ క్యాంపులు జిల్లాలోనే సాగాయి. ఆ మహోజ్వల పోరాటంలో సిరిసిల్ల ధిక్కార స్వరాన్ని వినిపించింది. రజాకార్ల దౌర్జన్యం, వెట్టి చాకిరిని రూపుమాపడం కోసం సాగిన గెరిల్లా పోరాటాలు, పోలీసుల చర్యలు సిరిసిల్లపై చెరగని ముద్రగా మిగిలిపోయాయి. మహోజ్వల పోరాటంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గాలిపెల్లి గ్రామంతో పాటు అనేక గ్రామాల్లో పలువురు రక్త తర్పణం చేశారు.

● నేడు ప్రజాపాలన దినోత్సవం..

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో సెప్టెంబరు17 తెలంగాణ విమోచనదినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రజాపాలన దినోత్సవంగా వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. జాతీయ పతాకాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆవిష్కరించున్నారు. ఉదయం 10 నుంచి 10.10గంటల వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించానున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలు ప్రజాపాలనలో దినోత్సవంలో భాగస్వామ్య కావడానికి సిద్ధమయ్యారు. తెలంగాణ విమోచన, ప్రజాపాలన దినోత్సవం నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిజాం సర్కారుకు వ్యతిరేకంగా సాగిన పోరాట జ్ఞాపకాలను ప్రజలు నెమరువేసుకుంటున్నారు. దేశమంతా 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకున్న నిజాం పాలనలో హైదరాబాద్ సంస్థాన వాసులు మాత్రం ఆ మధుర క్షణాలను అనుభవించడానికి 1948 సెప్టెంబరు 17 వరకు పోరాడాల్సి వచ్చింది. 224ఏళ్ల పాటు పాలించిన నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా చారిత్రాత్మకంగా సాగిన పోరాటాన్ని ప్రజలు ఆ నెత్తుటి జ్ఞాపకాలను మననం చేసుకుంటున్నారు. ఈ పోరులో సిరిసిల్ల ప్రాంతం ముఖ్య భూమికను పోషించింది. నిజాం ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీని నిషేధించినా కదిలిన పల్లెల ఆగ్రహాన్ని చూడలేక నిషేధాన్ని ఎత్తివేసింది. అలాంటి మహత్తర తెలంగాణ విమోచన పోరులో సిరిసిల్ల ప్రాంత గెరిల్లా యోధులు రక్త తర్పణం చేశారు. జిల్లాలోని ఇల్లంతకుంట మండలం గాలిపల్లికి చెందిన కమ్యూనిస్టు నాయకుడు బద్దం ఎల్లారెడ్డితోపాటు సిరిసిల్లకు చెందిన అమృత లాల్‌శుక్లా, మామిడిపల్లి హన్మంతరావు, సిహెచ్ రాజలింగం, నిమ్మపల్లి ఓడెలురెడ్డి, నాగారం కిష్టయ్య, మంచాల రాజేశం, రాగులపల్లి నర్సయ్య, సింగిరెడ్డి భూపతిరెడ్డి, ఇలా అనేక మంది తెలంగాణ పోరాటంలో పాలు పంచుకున్నారు.



బద్దం ఎల్లారెడ్డి విగ్రహం



గాలిపల్లి గ్రామం

సిరిసిల్లలో చేనేత కార్మిక సభ...

ఆంధ్ర మహాసభ స్ఫూర్తితో సిరిసిల్ల నేత కార్మికులు కూడా ముందుకు సాగారు. చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించడం కోసం చేనేత కార్మిక సంఘం ఏర్పడింది. సంఘం తెలంగాణ తృతీయ మహాసభను సిరిసిల్లలో జరుపుకున్నారు. అనేక మంది చేనేత కార్మిక ప్రతినిధులు సిరిసిల్లకు తరలివచ్చారు. చేనేత కార్మిక మహాసభ ఒక చారిత్రాత్మక సంఘటనగా రూపుదిద్దుకుంది. మహాసభ తర్వాత అమృత లాల్‌శుక్లాను ఉద్యోగం నుంచి తొలగించే..

- మిగతా 8లో

నిలకడగా వృద్ధుడు విఠల్ ఆరోగ్య పరిస్థితి..

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రజిత

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడు అజ్మీరా విఠల్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని మంగళవారం జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత హెల్త్‌బులిటెన్ విడుదల చేశారు. రుద్రంగి మండలానికి చెందిన అజ్మీరా విఠల్ తన భార్యతో కలిసి సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి వచ్చాడని తెలిపారు. కొడుకు,కోడలు తమను పోషించడం లేదని విఠల్ గడ్డిమందు తాగగా, కలెక్టర్ స్పందించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు. వైద్యులు ఐసీయూలో వైద్యం అందిస్తున్నారని, ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని పేర్కొన్నారు.

టెక్నికల్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయంలోని టాస్క్ రీజనల్ సెంటర్‌లో పలు టెక్నికల్ కోర్సులకు ఉచితంగా శిక్షణ అందిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘువేందర్ తెలిపారు. జావా వెబ్ డెవలప్‌మెంట్, పైతాన్, సీప్లస్, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, జావా స్క్రిప్ట్, టాలివిత్ జీఎస్టీ, ఆప్టిట్యూడ్ రీజనింగ్ సాఫ్ట్ స్కిల్స్‌పై ఉచితంగా శిక్షణ అందిస్తామన్నారు. జిల్లాలో ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించిన నిరుద్యోగ యువతీయువకులు ఈనెల 20లోపు టాస్క్ సెంటర్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. శిక్షణ పొందిన అభ్యర్థులు మంచి ప్యాకేజీలతో ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరాలకు 7075522671, 9533308928 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి..

- జిల్లా విద్యాధికారి వినోద్‌కుమార్



విద్యార్థులకు రాగి జావను పంపిణీ చేస్తున్న విద్యాధికారి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చక్కటి క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని జిల్లా విద్యాధికారి ఎస్ వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రం నెహ్రూనగర్‌లోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో రాష్ట్ర ప్రభుత్వం, సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా విద్యాధికారి వినోద్‌కుమార్ పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాల విద్యార్థులు నిత్యం సూక్ష్మ పోషకాలతో కూడిన రాగిజావను సేవించాలన్నారు. రాగి జావలో ఐరన్, కాల్షియం పోషకాలు ఎన్నో ఉన్నాయని విద్యార్థులు ఆరోగ్యకరంగా ఉండానికి రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి రాగిజావ తోడ్పడుతుందన్నారు. పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం, ఉచిత నోట్ పుస్తకాలు, పాఠపుస్తకాలను చక్కగా ఉపయోగించుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యరేఖ మాట్లాడుతూ తల్లిదండ్రుల సహకారంతో పాఠశాల అభివృద్ధి చెందుతుందన్నారు. గత సంవత్సరం పదవ తరగతిలో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారని అన్నారు. విద్యార్థులు రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీ పరీక్షలో ప్రతిభను కనబరచారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి దూస రఘుపతి, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మోతిలాల్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ గంగుల రుక్మిణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతును రక్షించిన కానిస్టేబుల్‌కు ఎస్పీ అభినందనలు



కానిస్టేబుల్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మానేరు వాగులో చిక్కుకున్న గంభీరావుపేట మండలంలోని మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన రైతు దేవయ్యను సురక్షితంగా రక్షించిన డీఆర్ఎఫ్ బృందంలోని కానిస్టేబుల్ సురెందర్‌ను ఎస్పీ మహేష్ బి గీతే అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో కానిస్టేబుల్ సురెందర్ కనబరిచిన ధైర్యసాహసాలకు ప్రోత్సాహకంగా ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కానిస్టేబుల్ సురెందర్ కర్తవ్యనిబద్ధత ప్రజాసేవకు నిదర్శనమన్నారు. ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలు లెక్క చేయకుండా పని చేసే పోలీసు సిబ్బంది సమాజానికి ఆదర్శప్రాయులని కొనియాడారు.

వేములవాడ-సిరికొండ రోడ్డు నిర్మాణానికి రూ.23కోట్లు

వేములవాడ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): వేములవాడ-సిరికొండ రోడ్డు నిర్మాణానికి 23 కోట్ల రూపాయలు మంజూరైనట్లు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ నియోజకవర్గ పరిధిలో పలు ప్రాంతాలలో రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరామన్నారు. ఇటీవల సీఎం ఢిల్లీ పర్యటనకు వెళ్లి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి చేసిన విజ్ఞప్తి మేరకు వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేట శివారు 10/02 కిలోమీటర్ల నుంచి కోనరావుపేట మండలం మామిడిపల్లి, బావుసాయిపేట, వట్టిమల్ల, భూక్య రెడ్డి తండా మీదుగా అజ్మీరా తండా శివారు సుమారు 18కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి కేంద్ర రహదారుల మౌలిక సదుపాయల నిధి(సీఆర్ఐఎఫ్) నిధుల నుంచి 23కోట్ల రూపాయలను మంజూరు చేశారని తెలిపారు. నిధుల మంజూరుకు చొరవ తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆది శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం..

- మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూపతిరుపతిరెడ్డి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో క్రీడలు, క్రీడాకారులను ప్రభుత్వం పోత్సహిస్తుందని మార్కెట్ కమిటి చైర్ పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని మినీ స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగే ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి పోటీలను ఆమె ప్రారంభించారు. అనంతరం జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న బాలబాలికల(విద్యార్థులు)ను క్రీడామైదానంలో చైర్‌పర్సన్ పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చదువుతో పాటు విద్యార్థులను క్రీడలవైపు మళ్లించాలని ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఎస్‌జీఎఫ్ క్రీడలను నిర్వహిస్తూ నైపుణ్యం కలిగిన విద్యార్థులను ప్రోత్సహిస్తుందన్నారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం పోటీలలో మొదటి రోజు వాలీబాల్ అండర్-14, అండర్-17, అథ్లెటిక్స్ రన్నింగ్ ఈవెంట్స్‌ను బాలబాలికలకు నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండాలాలకు చెందిన జట్లు, బాలబాలికలు వాలీబాల్, అథ్లెటిక్స్‌లో పోటీపడ్డారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్ర శ్రీనివాస్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలలో బాధిత కుటుంబాలను మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరామర్శించారు. సోమారంపేట, వెంకట్రావుపల్లె గ్రామాలలో అనారోగ్యంతో బాధపడుతున్నవారిని, మృతుల కుటుంబీకులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈయన వెంట జడ్పీమాజీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, రైతుసమన్వయ సమితీ మాజీ మండల అధ్యక్షుడు చెరుకుపల్లి రాజిరెడ్డి, బాలగౌడ్, ఒరుపుల రాములయాదవ్ తదితరులు ఉన్నారు.

మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేక శిబిరాలు
8
రైతుల వివరాలతో యాప్ సిద్ధం చేయాలి : కలెక్టర్

ఓటర్ జాబితా ఎస్ఐఆర్ కట్టుదిట్టంగా నిర్వహించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఓటర్ జాబితా స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్-2002పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2002 ఎస్ఐఆర్ ఓటర్ జాబితాతో తాజా ఓటరు జాబితాతో పరిశీలించి కామన్‌గా ఉన్న పేర్లు పక్కన పెట్టాలన్నారు. తదుపరి రోజులలో 2002 తర్వాత కొత్తగా ఓటరు నమోదు చేసుకున్న ప్రతి ఓటరు వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సి ఉంటుందన్నారు. గతంలో ఉన్న పోలింగ్ కేంద్రాల పరిధి, ప్రస్తుత పోలింగ్ కేంద్రాల పరిధి మ్యాచ్ చేసుకుంటూ ఓటరు జాబితా పరిశీలన చేయాలని, ఈ ప్రక్రియను కంట్రోల్ టేబుల్ మ్యాపింగ్ అంటామన్నారు. వేములవాడ సంబంధించి కంట్రోల్ టేబుల్ మ్యాపింగ్ పూర్తి చేసామని తెలిపారు. 2002లో జరిపిన ఎస్ఐఆర్ తరువాత ఓటు హక్కు సంక్రమించిన ప్రతిఒక్కరి వివరాలు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ధ్రువీకరించాల్సి ఉంటుందన్నారు. ఓటర్ జాబితాలో డూప్లికేట్ ఓట్లు, దొంగ ఓట్ల తొలగింపునకు 20 నుంచి 25 సంవత్సరాలకు ఒకసారి స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్(ఎస్ఐఆర్) చేయడం జరుగుతుందని, తెలంగాణలో 2002లో ఎస్ఐఆర్ చేశామన్నారు. 40 సంవత్సరాల కంటే ఎక్కువ వయసున్న ఓటర్ల జాబితా పరిశీలన చేయాల్సిన అవసరం ఉండదని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ప్రతి బూత్ పరిధిలో మిగిలిన ప్రతి ఒక్క ఎంట్రీ క్షేత్రస్థాయిలో ధ్రువీకరణ చేసేలా చూడాలని అన్నారు. ఈనెల22లోపు పాత జాబితాతో సరిచూసుకుంటు ధ్రువీకరించాల్సిన ఓటర్ జాబితాను సమర్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జి నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు,రాధాబాయి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులు, కార్మికులకు భద్రత కల్పించాలి


బోయినపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు, కార్మికులకు ప్రభుత్వాలు భద్రత కల్పించాలని సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు. బోయినపల్లి మండలం మాన్వాడ గ్రామంలో దివంగత మాజీ ఎమ్మెల్యే జోగినిపల్లి ఆనందరావుకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటానికి సీపీఐ పిలుపునిచ్చి ఎంతో మంది అమరులై, వేలాది గ్రామాలను, భూములను పేదలకు పంచి నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి చేశారన్నారు. 11 సంవత్సరాల బీజేపీ పాలనలో సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలని హామీని మరిచారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే బాధ్యత కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత తీసుకోవాలని, బోయినపల్లి మండలంలో డబుల్ బెడ్ రూమ్‌లు నిర్మించి పేదలకు పంచాలని, ఆసరా పెన్షన్‌లు మేనిఫెస్టోలో చెప్పిన విదంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలన్నా కే.వి అనసూర్య, శాంతా, పోచమల్లు, రాజేశం, దుర్గయ్య, అరవింద్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఎస్ఐ లక్ష్మణ్ సైబర్ నేరాల పట్ల మంగళవారం అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. గుర్తు తెలియని వ్యక్తులకు సోషల్ మీడియాలో తమ వివరాలు, ఫోటోలను పంపకూడదని అన్నారు. నేరాల పట్ల అవగాహన పెంచుకుని గ్రామాల్లోని ప్రజలను చైతన్యవంతులను చేయాలని ఎస్ఐ లక్ష్మణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓట్ల రాజకీయంతోనే 'విమోచన'ంగా జరపడం లేదు..

- బీజేపీ ఒత్తిడితోనే దిగివచ్చిన నాటి ప్రభుత్వం - జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి



సమావేశంలో మాట్లాడుతున్న గోపి

సిరిసిల్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓట్ల రాజకీయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం విమోచన దినోత్సవంగా జరపడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బీజేపీ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ బీజేపీ ఒత్తిడితోనే ఈనెల17న అధికారికంగా నిర్వహించేందుకు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చిన విమోచన దినోత్సవం పేరుతో మాత్రం జరపడం లేదన్నారు. గత సంవత్సరం కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా గుర్తిస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. కర్ణాటక, మహారాష్ట్రలో అధికారికంగా విమోచన దినోత్సవంగానే జరుపుతున్నారన్నారు. ప్రభుత్వం పేరు మార్చకుండా విమోచన దినోత్సవంగానే జరపాలని డిమాండ్ చేశారు. కేంద్ర హోంశాఖ మంత్రిగా సర్దార్ వల్లభాయ్ పటేల్‌లో 1948లో చేపట్టిన ఆపరేషన్ పోలోతో తెలంగాణా ప్రాంతానికి స్వాతంత్ర్యం వచ్చిందని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తెలంగాణలో నిజాం సంస్థానం అరాచక పాలన కొనసాగించిందన్నారు. వల్లభాయ్ పటేల్ ప్రత్యేక చొరవతో భారత సైన్యం నిజాం సంస్థానంపై దండెత్తిందని, దాంతో 1948 సెప్టెంబరు 17న నిజాం తలవంచాడని గుర్తుచేశారు. అప్పటినుంచి సెప్టెంబరు 17న రాష్ట్ర ప్రభుత్వం విమోచన దినోత్సవంగా అధికారికంగా జరపాలని ఎంతో మంది బీజేపీ నాయకులు పోరాటం చేశారని తెలిపారు. గత ప్రభుత్వంలో ఎంఐఎం నేతలకు కేసీఆర్ తలొగ్గి సమైక్య దినోత్సవంగా జరిపారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు రాజకీయాల కోసం విమోచన దినోత్సవాన్ని జరపడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు 17ను ముమ్మాటికి విమోచన దినోత్సవంగా జరపాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ సంస్థానంలో భాగమై కర్నాటక, మహారాష్ట్రలో కలిసిన జిల్లాల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా విముక్తి దినోత్సవాలను నిర్వహిస్తున్నాయన్నారు. 2014లో స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత సెప్టెంబరు 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించుకోవచ్చని ప్రజలు అనుకున్నారని, నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ద్వంద్వ వైఖరి వల్ల తెలంగాణ ప్రజల ఆశలు అడియాసలే అయ్యాయన్నారు. కేసీఆర్ అధికారంలోకి రాగానే ఓవైసీలకు తలొగ్గి ఎంఐఎంకు భయపడి ప్రజల ఆకాంక్షలను వమ్ము చేశారన్నారు. సమావేశంలో బీజేపీ పార్లమెంట్ కోకన్వీనర్ ఆడెపు రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు శీలం రాజు, ఉపాధ్యక్షురాలు బర్కం వెంకటలక్ష్మి, కార్యదర్శి కర్నె హరిష, పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, మీడియా కన్వీనర్ కాసుగంటి రాజురావు, కార్యదర్శి భాగయ్య, కౌన్సిల్ సభ్యుడు నాగుల శ్రీనివాస్,చందుపట్ల లక్ష్మారెడ్డి, గంభీరావుపేట్, వీర్నపల్లి మండల అధ్యక్షుడు కోడె రమేష్, లకుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రె పిల్ల అపహరణపై కేసు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామంలోని గొర్రెల మంద నుంచి గుర్తు తెలియని వ్యక్తులు గొర్రె పిల్లను అపహరించిన సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. తన గొర్రెల మంద నుంచి గుర్తు తెలియని వ్యక్తులు రూ.6 వేల విలువైన గొర్రె పిల్లను ఎత్తుకెళ్లారని బాధితురాలు బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు.

విద్యుత్ తీగ చోరీ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామ శివారులోని రైతు ధర్మాగౌడ్‌కు చెందిన వ్యవసాయ విద్యుత్ తీగను గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి మంగళవారం పేర్కొన్నారు. గ్రామంలోని తన వ్యవసాయ పొలం వద్ద ఉన్న రూ.30 వేల విలువైన విద్యుత్ తీగను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారని రైతు ధర్మాగౌడ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి చేసినట్లు తెలిపారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న ఎక్స్‌కావేటర్, టిప్పర్ పట్టివేత

శంకరపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టి తరలిస్తున్న ఎక్స్‌కావేటర్, టిప్పర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు కేశవపట్నం పోలీసులు తెలిపారు. హుజూరాబాద్ మండలానికి చెందిన రాపోలు కుమార్, వేణు అనే వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఎక్స్‌కావేటర్, టిప్పర్‌తో మట్టి తరలిస్తుండగా కొత్తగట్టు శివారులో పోలీసులు పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కరీంనగర్ టాస్క్‌ఫోర్స్‌లో భారీ ప్రక్షాళన

తొమ్మిది మంది సిబ్బంది తొలగింపు

అవినీతి ఆరోపణలే కారణమా?

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనరేట్‌లో అక్రమ దందాలపై దాడులు, అక్రమార్కులను పట్టుకునేందుకు ప్రత్యేకంగా ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ సిబ్బందిలో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇసుక అక్రమ దందా, పేకాట, వ్యభిచారం, గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలు, మద్యం అక్రమ అమ్మకాలు, గుడుంబా, నాటుసారా, డ్రగ్స్, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, కల్తీ వంట నూనె, ఆహార పదార్థాలు వంటి దందాలపై ఉక్కుపాదం మోపి, నేరస్థులను కటకటాల్లోకి నెట్టేందుకు దశాబ్దాల కాలంగా టాస్క్‌ఫోర్స్ విభాగం కమిషనరేట్‌లో కొనసాగుతున్నది. పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో ఈ టాస్క్‌ఫోర్స్ పోలీసు టీం పని చేస్తుంటుంది.



పోలీస్ కమిషనర్‌తో పాటు స్పెషల్ బ్రాంచి, ఇతర విభాగాలకు అంది న సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగి నేరస్థుల ఆటక ట్టిస్తుం టారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో నడు స్తున్న అక్రమ దందాలపై టాస్క్‌ఫోర్స్ నేరుగా దాడులు నిర్వహించి నిందితులను స్థానిక పోలీసులకు అప్పగి స్తుంది. స్థానిక పోలీ సులకు ఉన్న పరిచయాలతో కొన్ని సందర్భాల్లో కొన్ని అక్రమ దందాలను స్థానిక పోలీసులు పట్టించుకోరనే విమర్శలు న్నాయి. ఈ సందర్భంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగి అక్రమ దందాలను అరికడ తారు. టాస్క్ ఫోర్స్ పోలీసులు నేరుగా పోలీస్‌కమిషనర్‌కు అనుబంధంగా ఉంటారుకాబట్టి ఎలాంటి అవకతవకలకు తావు ఉండదనే భావన ఉంది.


సీపీ ప్రత్యేకంగా దృష్టి సారించి..

కరీంనగర్ టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న కొంతమంది సిబ్బందిపై ఇటీవల అవినీతి ఆరోపణలు వచ్చినందునే సిబ్బందిని పూర్తిగా తొల గించినట్లు తెలుస్తోంది. టాస్క్‌ఫోర్స్‌లో ఒక ఏసీపీ, సీఐ, ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, ఏడుగురు కానిస్టేబుళ్లు పనిచేస్తున్నారు. ఇందులో ఎస్‌ఐ, ఏఎస్‌ఐతో సహా ఏడుగురు కానిస్టేబుళ్లను తొలగించిన పోలీస్ కమిషనర్ వారిని హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని సోమవారమే మౌఖిక ఆదేశాలే జారీ చేశారు. కొద్ది రోజుల కిందట నిషేధిత గుట్కాను భారీ ఎత్తున పోలీసులు పట్టుకున్నారు. అంతకు ముందు పీడీఎస్ బియ్యం, గంజాయి, పేకాట శిబిరాలపై దాడులు చేసిన సందర్భాల్లో కొంత అవకత వకలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ముఖ్యంగా పేకాట శిబిరాలపై దాడులు చేసిన సమయాల్లో కొందరిని తప్పించడం, నిర్వాహకులపై కేసులు నమోదు చేయ కపోవడం, డబ్బుల లెక్కల్లో కూడా తేడా రావడంపై ఆరోపణలు ఉన్నాయి. టాస్క్‌ఫోర్స్ దాడులు చేసిన ఘటనల్లో అవినీతికి పాల్పడినట్లు పోలీస్ కమిషనర్‌కు పక్కాగా సమాచారం ఉండడంతోపాటు, ఫిర్యాదులు కూడా అందినందునే ఈ చర్యలు తీసుకున్నారని తెలిసింది. కొద్ది రోజులుగా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కదలికలపై ప్రత్యేక పోలీసు లతో నిఘా పెట్టారు. ఆరోపణలు నిర్ధారణ అయిన వెంటనే తొమ్మిది మందిని తొలగించారు. టాస్క్‌ఫోర్స్ విధుల నుంచి తొలగించిన 9 మంది మంగళవారం ఏఆర్ ఆర్‌ఐకి రిపోర్ట్ చేశారు.

ముందుగానే సమాచారం లీక్

కొత్తగా టాస్క్‌ఫోర్స్‌లో నియామకాల కోసం అవినీతి మరకలు లేని సిబ్బందిని ఎంపిక ప్రక్రియ జరుగుతున్నది. గతంలో కూడా చాలా సంద ర్భాల్లో పేకాట శిబిరాలపై టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు దాడి చేసిన సంద ర్భాల్లో నిందితులు అక్కడి కొన్ని నిమిషాల ముందే తప్పించుకునేవారు. సమా చారం అందించినవారికి అనుమానం కలిగే ది. అయినా ఏమీ చేయలేని పరిస్థితి. ఇంకా కొన్ని ఘటనల్లో సమాచారం అందించినవారి పేర్లు కూడా బయటకు వచ్చాయని చెబుతుండేవారు. స్థానిక పోలీసులకు ఉన్న ఒక రకమైన స్నేహం వల్లనే పట్టించుకోరనే వాదన ఉండేది. నిక్కచ్చిగా, నిజాయితీగా వ్యవహరిస్తారని భావిస్తున్న టాస్క్‌ఫోర్స్‌తో కూడా సరైన న్యాయం జరగడం లేదనే భావన కొందరిలో ఉంది. దీని కారణంగా అక్రమ కార్యకలా పాల గురిం చి, అసాంఘిక శక్తుల వివరాలు పోలీసులకు అందించేందుకు ఇది సమస్యగా మారు తుందని గుర్తించిన సీపీ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది. కమిషనరేట్ పరిధిలోని పలు స్టేషన్లలో కూడా కొందరు సిబ్బంది ఇదే విధంగా వ్యవహరిస్తు న్నారనే ఆరోపణలు న్నాయి. వీటిపై కూడా పోలీస్ కమిషనర్ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



ట్రాఫిక్ జరిమానా చెల్లించిన పోలీసుశాఖ డ్రైవర్లు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ ఉల్లంఘ నకు సంబంధించి పోలీసు శాఖ డ్రైవర్లు మంగళవారం జరిమానా చెల్లించారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించడంతో పోలీసు వాహనాలకు చలాన్‌ల రూపంలో జరిమానాలు పడ్డాయి. ఈ జరిమానాలను వాహనం నడిపిన పోలీసుశాఖ డ్రైవర్లే చెల్లించాలని సీపీ గౌస్ ఆలం ఆదేశించారు. దీంతో కమిషనరేట్ వ్యాప్తంగా ఆయా వాహనాలకు చెందిన 25 మంది డ్రైవర్లు చలాన్ రూపంలో జరిమానా చెల్లించారు. పోలీసు అధికారులు, సిబ్బంది ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ఆదర్శంగా ఉంటేనే ప్రజలు అనుసరిస్తారనే ఉద్దేశంతో ఈ చర్యలకు ఉపక్రమించారు.

అంధ విద్యార్థుల వీడియో ఆల్బమ్‌ను ఆవిష్కరించిన సీఎం

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అంధుల పాఠశాల విద్యార్థులు పాడి రూపొందించిన దివ్యదృష్టి వీడియో ఆల్బమ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ విద్యార్థులు రాగయుక్తంగా స్తోత్రాలను ఆలపించడం ఆనందాన్నిచ్చిందన్నారు. ఎంతో కృషి అభ్యాసం ఉంటే తప్ప ఇది సాధించలేరని, చిన్నారులు వృద్ధిలోకి రావాలని ఆశీర్వదించారు. కలెక్టర్ పమేలా సత్పతి విద్యారంగంలో చిన్నారులను ప్రోత్సహించడం ఆదర్శనీయమన్నారు. వీడియో ఆల్బమ్‌కు దర్శకత్వం వహించిన నంది శ్రీనివాస్, సంగీతాన్ని అందించిన కె.బి.శర్మ, సంగీత ఉపాధ్యాయిని సరళ, వీడియోగ్రఫీ చేసిన లక్ష్మీగౌతమ్‌ను సీఎం అభినందించారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కలిసి సచివాలయాన్ని సందర్శించారు. కరీంనగర్ ఫిలిం సొసైటీ అధ్యక్షుడు పొన్నం రవిచంద్ర సమన్వయంతో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి, చిన్నారి గాయకులు సింధుశ్రీ, శ్రావణి, తిరుమల, అఖిల, నిత్యశ్రీ, జాహ్నవి, కల్పన, ప్రణయ్, సాయిరామ్, మణిదీప్, అక్షయ్, వరుణ్‌తేజ్, మణిరతన్, లోహిత్, ప్రభుత్వ బధిరుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

గల్ఫ్‌లో కొత్తపల్లి వాసి మృతి



రాజయ్య(ఫైల్)

గంభీరావుపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన రాజయ్య (70) అనే వ్యక్తి గల్ఫ్‌లో గుండెపోటుతో మృతిచెందాడు. రాజయ్య 15 ఏళ్లుగా సౌదీ వెళుతున్నాడు. ఈ నెల 13న రాజయ్య గుండెపోటుకు గురై మృతిచెందినట్లు కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందింది. రాజయ్య మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

వాహనాల తనిఖీ

- సరైన పత్రాలు లేని 21 వాహనాలు సీజ్



వాహనాలు తనిఖీ చేస్తున్న డీటీవో

తిమ్మాపూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా రవాణాశాఖ, ట్రాఫిక్ పోలీసుల సంయక్త ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నూతనంగా ఎంపికైన అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్లకు శిక్షణలో భాగంగా మంగళవారం వాహనాల తనిఖీ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు కరీంనగర్ జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి శ్రీకాంత్ చక్రవర్తి తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ ఇతర పత్రాలు లేని 21 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. సుమారు 75వేల రూపాయల వరకు జరిమానా విధించినట్లు శ్రీకాంత్ చక్రవర్తి తెలిపారు. ప్రతి వాహనాదారుడు తమ వాహనాల పత్రాలను సరిచూసుకోవాలని సరియైన పత్రాలు లేనిదే రోడ్డు పైకి వస్తే జరిమానాతో పాటు వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ సీఐలు పర్శ రమేష్, ఆర్ఐ కుమారస్వామి, ఎస్సైలు, ట్రైనీ ఏఎంవీఐలు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

● 43గ్రాముల గంజాయి, ద్విచక్రవాహనం స్వాధీనం

ఇల్లంతకుంట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : గంజాయి కేసులో మండల కేంద్రానికి చెందిన మామిడి శ్రీకాంత్ (27)ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల రూరల్‌సీఐ మొగిలి తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్ జల్సాలకు అలవాటు పడటంతో డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో గంజాయికి అలవాటుపడటమే కాకుండా వ్యాపారం చేయాలనుకున్నాడు. ప్రస్తుతం కరీంనగర్‌కు చెందిన అరవింద్ వద్ద గంజాయిని మూడు రోజుల క్రితం కొనుగోలు చేసి ఇంటికి తీసుకవచ్చాడు. కొంత గంజాయిని తాగి మిగిలిన దానిని అమ్మడానికి మంగళవారం ద్విచక్రవాహనంపై వెళుతుండగా జంగమరెడ్డిపల్లె కమాన్ వద్ద పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశాడు. శ్రీకాంత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా 43 గ్రాముల గంజాయి దొరికింది. గంజాయి, ద్విచక్రవాహనం, మొబైల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై లక్‌పతి పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో వేములవాడ అర్బన్ పరిధిలోని చింతల్‌ఠాణాకు చెందిన మంత్రి ఆనందంకు జీవిత ఖైదు రూ.1000 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజ మంగళవారం తీర్పు వెల్లడించారు. ఎస్పీ మహేష్ బి. గీతే తెలిపిన వివరాల ప్రకారం... జూలపల్లి మండలంలోని తేలుకుంటకు చెందిన మర్రిపెల్లి రాజయ్య(64) అనే వ్యక్తి వేములవాడ శివారులోని ఓ మామిడితోటలో తోటకాపరిగా ఉన్నాడు. ఇతనితో పాటు మంత్రి ఆనందం తోటకాపరిగా పనిచేస్తుండేవాడు. వీరి మధ్య తరచుగా తోటపని విషయంలో గొడవలు జరిగేది. ఈ గొడవల్లో భాగంగా ఏప్రిల్ 29,2024న రాత్రి అంతకుముందు తిట్టిన విషయంను ఆనందం మనసులో పెట్టుకొని ఇనుపరాడుతో రాజయ్య తలపై బాది హత్యచేశాడు. రాజయ్య కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా కోర్టు కానిస్టేబుల్ మహేందర్ నవీన్‌లు కోర్టులో 16మంది సాక్షులను ప్రవేశపెట్టారు. పీపీ పెంట శ్రీనివాస్ కేసు వాదించగా పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడిపై నేరం రుజువు కావడంతో జీవితఖైదుతో పాటు రూ.1000 జరిమానా విధించారు. శిక్ష పడటంలో కృషి చేసిన వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్‌ను, పీపీ పెంట శ్రీనివాస్, కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీంద్రనాయుడు, కానిస్టేబుళ్లు మహేందర్, నవీన్‌లను ఎస్పీ అభినందించారు.

కొనుగోళ్ల కమీషన్‌లో అవకతవకలపై నిలదీత

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కొనుగోళ్లకు సంబంధించిన కమీషన్‌లో పలు అవకతవకలు చోటు చేసుకున్నాయని, లెక్కలు చెప్పాలంటూ సభ్యులు, స్థానికులు మంగళవారం ఆందోళనకు దిగారు. వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామంలో మంగళవారం ఐకేపీ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇటీవల గ్రామైక్య సంఘం వారు వరి ధాన్యం కొనుగోలు చేశారని అందుకు వచ్చిన కమీషన్ లెక్కలు చెప్పకుండా దాట వేస్తున్నారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కమీషన్, ఇతర లెక్కలు తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామని పేర్కొంటూ సమావేశాన్ని ఈ నెల 22వ తేదీకి వాయిదా వేస్తున్నామని ఐకేపీ ఏపీఎం సుదర్శన్ వివరించడంతో శాంతించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

మల్యాల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మల్యాల బ్లాక్ చౌరస్తా సమీపంలో మంగళవారం ఓ ఇంట్లో చోరీ జరిగింది. కట్టెకోల మల్లేశ్వరి అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రామన్నపేటలో తన అక్క ఇంటికి వెళ్లింది. మంగళవారం ఇంటికి రాగా వెనుకాల గేట్ గొలుసు పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూస్తే బీరువాలోని తులం బంగారు ఆభరణాలు, పది తులాల వెండితో పాటు రూ.10 వేల నగదు దొంగలు ఎత్తు కెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందిం చింది. ఎస్సై ఏ.నరేశ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.300 కోసం ఆటో డ్రైవర్ హత్య

● కిరాయి చెల్లింపు విషయంలో వాగ్వాదం ● వివరాలు వెల్లడించిన జగిత్యాల డీఎస్పీ రఘుచందర్



మృతుడు నయిమొద్దీన్ (ఫైల్)

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం హైదర్‌పల్లి సమీపంలో రూ.300 కోసం ఆదివారం అర్ధరాత్రి ఆటో డ్రైవర్ నయిమొద్దీన్(50)ను బీహార్‌కు చెందిన ఇద్దరు కూలీలు బండరాయితో మోది దారుణంగా హత్య చేశారు. నిందితులైన దర్శన్ సాహ్ని. సునీల్ సాహ్నిలను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జగిత్యాల రూరల్ సీఐ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో డీఎస్పీ రఘుచందర్ హత్య కేసు వివరాలను వెల్లడించారు. జగిత్యాల పట్టణంలోని సుతారిపేటకు చెందిన ఎండీ నయిమొద్దీన్ పట్టణంలో ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. బీహార్ రాష్ట్రానికి చెందిన దర్శన్‌సాహ్ని, సునిల్ సాహ్ని, పంకజ్ అనే ముగ్గురు జగిత్యాల మండలం హైదర్‌పల్లి, పొలాస శివారులో గల రైస్ మిల్లుల్లో కూలీలుగా పనిచేస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి జగిత్యాల నుంచి వారు పనిచేసే రైస్ మిల్లులకు వెళ్లేందుకు ముగ్గురు బీహార్ కూలీలు నయిమొద్దీన్ ఆటోను అద్దెకు మాట్లాడుకున్నారు. పంకజ్ అనే బీహార్ కూలీ పొలాస దగ్గర దిగిపోయి ఆటో కిరాయి మిగిలిన వారు ఇస్తారని డ్రైవర్‌తో చెప్పాడు. ఆటో హైదర్‌పల్లిలోని రైస్‌మిల్లు సమీపంలోకి రాగానే ఆటో డ్రైవర్ నయిమొద్దీన్ బీహార్ కూలీలైన దర్శన్ సాహ్ని. సునీల్ సాహ్నిలను కిరాయి డబ్బులు అడిగాడు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలోనే మాటామాటా పెరిగి ఆటోడ్రైవర్ నయిమొద్దీన్ గొంతును టవల్‌తో దర్శన్ సాహ్ని అనే కూలీ బిగించగా మరో నిందితుడు సునీల్ సాహ్ని బండరాయితో దాడిచేసి హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని రోడ్డు పక్కన ఉన్న కాలువలో పడేశారు. మృతుడు నయిమొద్దీన్ సోదరుడు ఇసాక్‌ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న జగిత్యాల రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు. సీసీ ఫుటేజీలు, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా హత్య కేసును ఛేదించి నిందితులను పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి మృతుడు నయిమొద్దీన్ మొబైల్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు.



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

యువతి ఆకస్మిక మృతి

జ్యోతినగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పర్మినెంటు టౌన్‌షిప్ (పీటీఎస్)లో మంగళవారం పొగిడి అనూష(29) అనే యువతి మృతి చెందింది. అనూష మృతిపై ఎన్టీపీసీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఎన్టీపీసీ సంస్థలో అధికారిగా పనిచేస్తున్న పొగిడి జయరాజు పీటీఎస్‌లోని డి టైపు క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. జయరాజు కుమార్తె అనూష కొంత కాలంగా మానసికంగా ఇబ్బందిపడుతోంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కుమార్తె నిద్ర లేవకపోవడతో ఆమెను లేపే ప్రయత్నం చేశాడు. కదలికలు లేకపోవడంతో అనూషను టౌన్‌షిప్‌లోని ఎన్టీపీసీ ధన్వంతరి ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఆమెను పరిశీలించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు ప్రకటించారు. విషయాన్ని జయరాజు ఎన్టీపీసీ పోలీసుకు తెలిపారు. ఎన్టీపీసీ ఎస్‌ఐ టి.ఉదయ్‌కిరణ్ సంఘటన స్థలానికి వెళ్లి విచారించారు. అనూష మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

చోరీలకు పాల్పడుతున్న విద్యార్థి అరెస్టు

కోల్‌సిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలావాటు పడి, డబ్బుల కోసం చోరీలకు పాల్పడుతున్న డిగ్రీ విద్యార్థి కవ్వంపల్లి అరుణ్ కుమార్(20)ని మంగళవారం అరెస్టు చేసినట్లు డీసీపీ కరుణాకర్ పేర్కొన్నారు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన అరెస్టు వివరాలను వెల్లడించారు. గోదావరిఖని పట్టణంలోని విఠల్‌నగర్‌లో ఈ నెల 10, 11తేదీల్లో రాత్రి ఇళ్లలో గుర్తు తెలియని వ్యక్తి చోరీలకు పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేరెడ్డి ఎస్‌ఐలు, క్రైమ్ పార్టీ సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం ఫైవింక్లయిన్ వద్ద అనుమానస్పదంగా తిరుగుతున్న అరుణ్‌కుమార్‌ను పట్టుకున్నారు. అతన్ని విచారించగా తాను డిగ్రీ విద్యార్థినని, చెడు అలవాట్లకు బానిసై జల్సాలకు డబ్బుల కోసం చోరీలకు పాల్పడినట్టు తెలిపాడన్నారు. తాళం వేసిన ఇండ్లను గుర్తించి వెనుక డోర్లు పగులగొట్టి చోరీలకు పాల్పడేవాడన్నారు. దొంగిలించిన సొత్తును విక్రయించి జల్సాలు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. అతని వద్ద నుంచి 23.6గ్రాముల బంగారు ఆభరణాలు, 45తులాల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సొత్తు విలువ రూ.1.93లక్షలు ఉంటుందని డీసీపీ పేర్కొన్నారు.

చోరీ సొత్తు కొన్నా, తాకట్టు పెట్టుకున్నా కేసులే..

చోరీ సొత్తును ఎవరైనా కొనుగోలు చేసినా, తాకట్టు పెట్టుకున్నా వారిపై కేసులు నమోదు చేస్తామని డీసీపీ పేర్కొన్నారు. ప్రైవేట్ గోల్డ్‌లోన్ కంపెనీలు తాకట్టు పెట్టుకునే సమయంలో అన్ని విచారణలు జరుపాలని, వివరాలు తీసుకోవాలన్నారు. అలా కాదని చోరీ సొత్తును తాకట్టు పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కేసును ఛేధించడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్‌ఐ అనూష, క్రైమ్ పార్టీ హెడ్ కానిస్టేబుల్ రమేష్, సదానందం, కానిస్టేబుళ్లు మధుకర్, మధుసూధన్, రమేష్‌లకు డీపీసీ క్యాష్ రివార్డు అందజేశారు. ఏసీపీ రమేష్, సీఐ ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

ఇసుక కోసం వెళ్లి.. మానేరులో చిక్కుకొని

● కాపాడిన స్థానికులు, పోలీసులు

సుల్తానాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని గట్టేపల్లికి చెందిన కొందరు ట్రాక్టర్ యజమానులు, కూలీలు ఇసుక కోసం ట్రాక్టర్లతో మానేరు వాగులోకి మంగళవారం ఉదయం వెళ్లారు. కరీంనగర్‌లోని ఎల్ఎండీ నుంచి నీరు విడుదల చేసిన విషయం వారికి తెలియదు. మహిళతో పాటు ఎనిమిది మంది వాగులో ఇసుక నింపుతుండగా ఒక్కసారిగా నీటి ఉధృతి పెరగడంతో చిక్కుకుపోయారు. వారు బయటకు రాలేని దుస్థితి నెలకొంది. ప్రవాహంలో ట్రాక్టర్లు కొట్టుకుపోయాయి. బాధితులు పెద్దగా కేకలు వేయడంతో వాగు ఒడ్డున ఉన్న వారు సహాయక చర్యలు చేపట్టి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సుబ్బారెడ్డి, ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ మానేరు వాగు వద్దకు వచ్చి స్థానికుల సహాయంతో వాగులో ఉన్న వారిని తాళ్లతో బయటకు తీసుకువచ్చారు.



గట్టేపల్లి మానేరు వాగులో చిక్కుకున్న వారిని తాళ్లతో బయటకు తీస్తున్న స్థానికులు

● ఎవరూ వాగులోకి వెళ్ల వద్దు

ఎవరూ మానేరు వాగులోకి వెళ్లవద్దని సీఐ సుబ్బారెడ్డి, ఎస్‌ఐ శ్రావణ్ కుమార్‌లు హెచ్చరించారు. మానేరు పరివాహక ప్రాంత గ్రామాలకు చెందిన ఇసుకను తరలించే ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు కూలీలతో సమావేశం నిర్వహించి మానేరు గేట్లు ఎత్తడంతో నీటి ఉధృతి పెరిగిందని ప్రమాదకరంగా ఉందన్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

అర్కండ్ల వాగులో కొట్టుకుపోయి.. సురక్షితంగా ఒడ్డుకు



అర్కండ్ల వాగులో కొట్టుకుపోతున్న వ్యక్తి

శంకరపట్నం: మండలం అర్కండ్ల లోలెవెల్ బ్రిడ్జిపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి జారిపడి నీటి ప్రవాహంతో కొంత దూరం కొట్టుకుపోయి సురక్షితంగా బయటపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్కండ్ల లో లెవెల్ బ్రిడ్జిపై నుంచి నీరు భారీగా ప్రవహిస్తుండగా ఓ వ్యక్తి నడుచుకుంటూ వాగు దాటే ప్రయత్నం చేశాడు. లో లెవెల్ బ్రిడ్జి నాచు పట్టి ఉండడంతో జారిపడి నీటి ప్రవాహంలో కొంత దూరం కొట్టుకుపోయాడు. ఆధారం దొరకగానే ఈదుకుంటూ బయటకు సురక్షితంగా చేరాడు. వాగుపై బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఇల్లందకుంట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడి తలకు తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ క్రాంతి కుమార్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మొగుళ్లపల్లి మండలంలోని పిడిసిల్ల గ్రామానికి చెందిన మాదం రత్నాకర్ (40) తన ద్విచక్ర వాహనంపై పిడిసిల్ల నుంచి కల్లుపల్లెకు ఈ నెల 12న వెళ్తుండగా బూజునూర్ గ్రామంలో కుక్కలు అడ్డు రాగా బైక్‌పై నుంచి జారి కిందపడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్ క్రాస్‌రోడ్ వద్ద ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

భార్యను హతమార్చిన భర్త అరెస్టు

● పరారీలో అత్తమామలు

కోల్‌సిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం పన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలోని వకీల్‌పల్లి ప్లాట్స్‌లో ఈ నెల 14న మేడి రమాదేవి అలియాస్ పూసాల ప్రశాంతి హత్య కేసులో నిందితుడు ఆమె భర్త పూసాల కృపాకర్ అలియాస్ ప్రభాకర్ (45)ను మంగళవారం అరెస్టు చేసినట్లు డీసీపీ కరుణాకర్ పేర్కొన్నారు. మంగళవారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన అరెస్టు వివరాలను వెల్లడించారు. ఈ నెల 14న ఉదయం ప్రశాంతిని ఆమె భర్త హత్య చేశాడని, గోదావరిఖని ఏసీపీ రమేష్ ఆధ్వర్యంలో రామగిరి ఎస్‌ఐలు శ్రీనివాస్, దివ్యలు ప్రత్యేక టీములతో నిందితున్ని లద్నాపూర్ వద్ద పట్టుకున్నారన్నారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు కృపాకర్ తల్లిదండ్రులైన శ్యామల, రంగయ్యలు పరారీలో ఉన్నారన్నారు. మంచిర్యాల రెడ్డి కాలనీకి చెందిన రమాదేవి అలియాస్ ప్రశాంతిని పన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలోని వకీల్‌పల్లి ప్లాట్‌లో నివాసముండే పూసాల కృపాకర్ వేరు వేరు సామాజికవర్గాలకు చెందిన వారు 13ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడన్నారు. వీరికి కుమారుడు జాన్సన్(10), కుమార్తె జోషిత్(9), జ్యోత్స్న(7)లు ఉన్నారు. ఏడాదిగా వీరి మధ్య కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. అప్పటి నుంచి భార్యభర్తలు వేరువేరుగా ఉంటున్నారు. ఈ నెల 14న రమాదేవి కృపాకర్ ఇంటికి వచ్చిందని, ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగిందన్నారు. రమాదేవిని చంపితేనే సమస్య పరిష్కారమవుతుందని భావించి కృపాకర్ ఆమెపై కత్తితో దాడి చేశారన్నారు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్టు డీసీపీ తెలిపారు. అత్తమామలు పరారీలో ఉన్నారని, విచారణ జరుగుతుందన్నారు. సమావేశంలో గోదావరిఖని ఏసీపీ రమేష్, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, రామగిరి ఎస్‌ఐ శ్రీనివాస్, దివ్య పాల్గొన్నారు.



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కరుణాకర్

నిధులు మంజూరు చేయాలి

- వాగులో కూర్చొని యువకుడి నిరసన



వాగు నీటిలో కూర్చున్న మోహన్

చందుర్తి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వంతెనల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని ఓ యువకుడు ఎనగల్ గ్రామంలో వాగులో కూర్చొని మంగళవారం ఆందోళన చేపట్టాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని ఎనగల్ గ్రామంలో పెద్దమ్మ, ఎల్లమ్మ ఆలయాల సమీపంలో వాగులో వంతెనలు నిర్మించాలని పుప్పాల మోహన్ అనే యువకుడు వాగులో కూర్చొని ఆందోళన చేపట్టాడు. వ్యవసాయ పనుల కోసం రైతులు, ఈత, తాటి వనానికి వెళ్లేందుకు గౌడ కులస్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఎస్సారెస్పీకి పెరిగిన ఇన్‌ఫ్లో

జగిత్యాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్(ఎస్సారెస్పీ)కు మంగళవారం ఇన్‌ఫ్లో పెరిగింది. 37 గేట్లు పైకి ఎత్తి 2,58,705 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు ప్రస్తుతం 77.40 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద కాలువకు 8,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 4,000, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది.

శ్రీపాద ఎల్లంపల్లికి కొనసాగుతున్న వరద

పెద్దపల్లి: జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద కొనసాగుతున్నది. మంగళవారం సాయంత్రం వరకు 4,51,833 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా, 38 గేట్ల ద్వారా గోదావరిలోకి 4,89,996 క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతున్నారు. ఎస్సారెస్పీ నుంచి 2,32,128 క్యూసెక్కులు వస్తుండగా, కడెం నుంచి 14,964 క్యూసెక్కులు, పరివాహక ప్రాంతం నుంచి 2,04,741 క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయి. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 19.064 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టుల నుంచి పెద్దఎత్తున వరద నీరు వస్తున్నదని, ఈ నేపథ్యంలో 5 నుంచి 6 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలిపెడుతున్నామని, పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామగుండం సర్కిల్ 7 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి రవీంద్రాచారి కోరారు.

మిడ్ మానేరుకు..

బోయినపల్లి: శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి (మిడ్ మానేరు) ప్రాజెక్టుకు మంగళవారం 15161 ఇన్‌ఫ్లో కొసాగుతోంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 7450, మానేరు, ములవాగు ద్వారా 7741 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. దిగువకు రెండు గేట్ల ద్వారా 8000 క్యూసెక్కులు, ప్యాకేజీ 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు, ప్యాకేజీ 9లోని మల్కపేట రిజర్వాయర్‌కు 561 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.9 ఉండగా, సామర్థ్యం 27.55 టీఎంసీలకు 27.299 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట: మండలంలోని అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి రెండుపంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.07టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా వస్తున్న 6400క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 3300క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.


ఎల్ఎండీకి పెరిగిన వరద

తిమ్మాపూర్: వర్షాలతో ఎగువ నుంచి కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి వస్తున్న వరద పెరిగింది. సోమవారం వరకు కేవలం ఎల్ఎండీ స్పిల్ వే రెండు గేట్లు ఎత్తి 4వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేసిన అధికారులు, ఇన్‌ఫ్లో పెరగడంతో మంగళవారం తెల్లవారు జామున 3 గంటలకు మరో 4 గేట్లు ఎత్తారు. మొత్తం 6 గేట్ల ద్వారా 14వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. మోయతుమ్మెదవాగు నుంచి 10,509 క్యూసెక్కులు, మిడ్ మానేరు నుంచి 7 వేల క్యూసెక్కులు, ఎగువ కాకతీయ నుంచి 800 క్యూసెక్కులు మొత్తం 18,309 క్యూసెక్కుల నీరు ఎల్ఎండీలోకి వస్తోంది. పూర్తి స్థాయి నీటిమట్టం 24.034 టీఎంసీలు కాగా 23.602 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.

చరిత్ర మరువని రోజు సెప్టెంబరు 17

తెలంగాణ చరిత్ర మరువని రోజు 1948 సెప్టెంబరు 17. అది నిజాం నిరంకుశత్వం తలవంచిన రోజు. రజాకార్ల ఆగడాలు అంతమైన రోజు. నాటి రెండు కోట్ల మంది తెలంగాణ ప్రజల హృదయాల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడిన పర్వదినం. ఈ నేలపై త్రివర్ణపతాకం ఎగిరిన రోజు. నిజాం రాచరిక పాలన ముగిసి, హైదరాబాద్ రాజ్యం భారత ప్రభుత్వంలో కలిసిన ఆ రోజు వెనుక అనేక ఘటనలు ఉన్నాయి. అందులో కొన్ని అంశాలు, ప్రముఖుల అభిప్రాయాలతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

- హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి)



ఈ ఘట్టానికి ప్రతినాయకుడు ఖాసీం రజ్వీ

భయంతో ఆస్తులమ్మారు



పోలీసు యాక్షన్‌కు వారం ముందు 'బక్రీదుకు గొర్రెలను కాదు, హిందువుల తలలు నరుకుతాం. వాళ్ల రక్తంతో హోలి ఆడతాం' అని రజాకార్ నాయకుడు ఖాసీం రజ్వీ ప్రకటించినట్లుగా నగరమంతా వదంతులు వ్యాపించాయి. దాంతో హిందువులంతా భయంతో ఆస్తిపాస్తులు అమ్ముకొని బతికినన్నాళ్లు అయినా ఆనందంగా జీవించాలని విందులు చేసుకున్నారు. అదే సమయంలో భారత సైన్యం ప్రవేశించడంతో నిజాం లొంగిపోయాడని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. యుద్ధ ట్యాంకులు, వాహనాలకు పూలమాలలు వేసి, భారత జవానులకు లడ్డూలు తినిపిస్తూ సంబురాలు చేసుకున్నారు. ముస్లింలంతా రజాకార్లు కాదు. ఆ సమయంలో రజాకార్ల దాడినుంచి ఎంతోమంది హిందువులను ముస్లింలు కాపాడారు. ఈ విషయాలన్నీ ప్రత్యక్ష సాక్షి మా అక్కచెప్పగా నాకు తెలిశాయి.

- పరవస్తు లోకేశ్వర్, నగర చరిత్ర పరిశోధకుడు

తెలంగాణ చరిత్రలోనే మరచిపోలేని సెప్టెంబరు 17 ఘట్టంలో ప్రతినాయకుడు ఖాసీం రజ్వీ. 'మజ్లిస్ ఎ ఇత్తేహాద్ ఉల్ ముస్లిమీన్' నాయకుడు. ఆయన స్వస్థలం మరఠ్వాడాలోని ఉస్మానాబాద్ జిల్లా లాతూర్. అలీగఢ్‌లో న్యాయశాస్త్రం అభ్యసించిన అనంతరం హైదరాబాద్‌లో కొంతకాలం వకీలు మహమ్మద్ అలీ ఫాజిల్ దగ్గర సహాయకుడిగా పనిచేశాడు. తర్వాత సొంతూరుకు వెళ్లిన అతను మజ్లిస్ స్థానిక నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందాడు. యావదాస్తిని సంఘానికి రాసిచ్చి నాయకుల మనసులో ప్రత్యేక స్థానం సంపాదించాడు. కొద్దిరోజులకే సంస్థ పగ్గాలు చేపట్టాడు. సమయస్ఫూర్తి, వాగ్ధాటితో సామాన్యులను ఆకట్టుకున్న రజ్వీ నిజాం ప్రభుత్వాన్ని శాసించే స్థాయికి ఎదిగాడు. రజాకార్ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. హింసాత్మక ఘటనలకు కారకుడయ్యాడు. పోలీసు చర్య అనంతరం రజ్వీని భారత సైన్యం అరెస్టుచేసి తిరుమలగిరి సైనిక కారాగారంలో నిర్బంధించింది. 1957, సెప్టెంబరు11న విడుదలయ్యాడు. అదే నెల18న నగరం నుంచి ముంబైకు, అక్కడి నుంచి పాకిస్థాన్‌కు వెళ్లిపోయాడు. కరాచీలో ఒక అనామకుడిగా జీవనం సాగిస్తూ న్యాయవాదిగా ప్రాక్టీసు మొదలుపెట్టాడు. ఒకనాడు ఈ నేలను శాసించాలనుకున్న ఇత్తేహాదుల్ సారథి 1970, జనవరి15న ఓ సాధారణ వ్యక్తిగా కన్నుమూశాడు.

నిజాం ప్రధానిమీదా రజాకార్ల దాడి

నిజాం నిరంకుశ పాలనలో సామాన్యుల మానప్రాణాలను హరించిన రజాకార్లు నిజాం ప్రధాని మీదా దాడి చేయడం కొంత మందికే తెలుసు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని ఓ ఆస్పత్రి ఆవరణలో తలెత్తిన ఘర్షణలో తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించాలన్న కాంక్షతో కొంతమంది రజాకార్లు ఆనాటి ప్రధాని అధికారిక నివాసం షా మంజిల్(ప్రస్తుతం రాజ్‌భవన్)ను ముట్టడించారు. లోపల గృహోపకరణాలకు నిప్పుపెట్టారు. అంతటితో ఆగక ప్రధానమంత్రిపై సైతం దాడికి పాల్పడ్డారని మందుముల నరసింహారావు జ్ఞాపకాల్లో ప్రస్తావించారు.

దక్కన్ రేడియోలో స్వాతంత్ర్య ప్రకటన

భారత ఆర్మీ 1948, సెప్టెంబరు18న నగరానికి చేరింది. అంతకు ఒకరోజు ముందు రోజు సెప్టెంబర్17న ఖాసీం రజ్వీ హైదరాబాద్‌లో నరమేధానికి వ్యూహం పన్నాడు. ఈ విషయం తెలిసి ఉస్మానాబాద్ కలెక్టర్ మొహమ్మద్ హైదర్ ఆనాటి నిజాం పోలీసు ఉన్నతాధికారి నవాజ్ దీన్‌యార్‌జంగ్ దగ్గరకు పరుగుతీశాడు. ఇరువురు ఫోన్‌ద్వారా రజ్వీకి నచ్చజెప్పి కల్లోలాన్ని ఆపించారు. ఈ విషయాన్ని మొహమ్మద్ హైదర్ జ్ఞాపకాల్లో రాశారు.

అంతకు ముందురోజే సైన్యాధ్యక్షుడు ఎల్.ఇద్రూస్ నిజాంను కలిసి సైన్యాన్ని ప్రతిఘటించడం వల్ల మరింత ప్రాణ నష్టం మినహా మరేమీ లేదని విన్నవించాడు. దీంతో సెప్టెంబరు17న మొదట ఖాసీం రజ్వీ ఖైరతాబాద్‌లోని దక్కన్ రేడియో ద్వారా తన ఓటమిని అంగీకరించాడు. ఆ తర్వాత కేఎంమున్షీతో కలిసి దక్కన్ రేడియోకు చేరుకున్న నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్... భారత సైన్యాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో కొన్ని వందల ఏళ్ల రాచరిక పాలన నుంచి ఈ నేలకు స్వాతంత్ర్యం సిద్ధించింది. ప్రజలంతా ఆనందోత్సాహాలతో సంబురాలు చేసుకున్నారు. నగర వీధుల్లో జాతీయ జెండా ఎగరేశారు.

అమరుల త్యాగాలను పాఠ్యపుస్తకాల్లో ముద్రించాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

తిమ్మాపూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నాటి అమరుల త్యాగాలను పాఠ్య పుస్తకాల్లో ముద్రించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా చాడ వెంకటరెడ్డి మండలంలోని పోలంపల్లిలో ఏర్పాటు చేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు అనభేరి ప్రభాకర్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీపీఐ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనభేరి ప్రభాకర్‌రావు సొంత గ్రామమైన పోలంపల్లిలో సీపీఐ పక్షాన



పోలంపల్లిలో సీపీఐ ర్యాలీలో చాడ వెంకట్‌రెడ్డి

భారీ ర్యాలీ నిర్వహించి ఆయనకు నివాళులర్పించడం గర్వంగా ఉందని అన్నారు. 10 లక్షల ఎకరాల ప్రభుత్వ భూములను పేదలకు పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి ఉందని తెలిపారు. అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహాన్ని హైదారాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, మండల కార్యదర్శి బోయిని తిరుపతి, నాయకులు సూరం మల్లేశం, పిట్టల శ్రీనివాస్, ఎల్లాస్వామి, బండారి రమేష్, తిరుపతిరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో సబ్బండ వర్గాలకు సమన్యాయం

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన ప్రభుత్వంలో సబ్బండ వర్గాలకు సమన్యాయం జరుతుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మాదిగల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్ అధ్యక్షతన మాదిగల ఆత్మీ సమ్మేళన సభ జరిగింది. ముఖ్య అతిథిగా మంత్రి లక్ష్మణ్ కుమార్‌తో పాటు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో మంత్రిని మాదిగ నాయకులు ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. రాహుల్‌గాంధీ, ఖార్గే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ మాదిగల పక్షాన మంత్రిగా తనకు అవకాశం ఇచ్చారన్నారు. నేరెళ్ల సంఘటనపై ఆరోజు కాంగ్రెస్ నాయకులం కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితులను పరామర్శించామన్నారు. నాటి స్పీకర్ మీరా కుమారి స్వయంగా వచ్చి నేరెళ్ల బాధితులను పరామర్శించినప్పుడు బాధితుల ఆవేదన కన్నీల్లు పెట్టించిందన్నారు. కేటీఆర్, సంతోష్‌రావు తదితరులు విచక్షణా రహితంగా నేరెళ్ల ఘటనలో దళితులపై దాడులు చేయించారని ఆరోపించారు.

అసెంబ్లీలో ముఖ్యమైన ఘట్టం వర్గీకరణ చట్టంను అమలు చేస్తుంటే చట్టసభకు రాకుండా ఫాంహౌస్‌కు పరిమితం అయ్యాడని ఆరోపించారు. దళితులకు చెందాల్సిన భూములు వారికిచ్చే బాధ్యతను తీసుకుంటామన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ చంద్రంపేట చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే కర్రోల్ల నర్సయ్య విగ్రహం ఏర్పాటు, అదేవిధంగా జిల్లా కేంద్రంలో అంబేద్కర్ ఫంక్షన్‌హాల్‌ను నిర్మాణం చేయాలన్న నాయకుల ప్రతి పాదనను పరిశీలిస్తామన్నారు. రగుడు వద్ద అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండుగులపై చర్యలు తీసుకోవాలని దళిత నాయకుడు రాగుల రాములు విజ్ఞప్తిని ఎస్పీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, మాజీవిప్ ఆరెపెల్లి మోహన్, కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఉపాధ్యక్షుడు బొప్ప దేవయ్య, టీపీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య పాల్గొన్నారు.

ఆర్టీఐ చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలి

● రాష్ట్ర సమాచార ప్రధాన కమిషనర్ డాక్టర్ జి చంద్రశేఖర్‌రెడ్డి

సిరిసిల్ల సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సమాచార హక్కు చట్టం-2005ను అధికారులు కట్టుదిట్టంగా అమలుచేయాలని రాష్ట్ర సమాచార ప్రధాన కమిషనర్ డాక్టర్ జి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సమాచార అధికారులకు ఆర్టీఐ చట్టం అమలులో ఉన్న సందేహాలను అడిగి నివృత్తి చేశారు. సమాచార హక్కు చట్టం సంబంధించి జిల్లాలో పెండింగ్ ఉన్న 134 కేసులను కమిషన్ సభ్యులు పరిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజా సమాచార అధికారి, మొదటి అప్పిలేట్ అథారిటీ, రెండో అప్పిలేట్ అథారటీ పేర్లు, ఫోన్ నంబర్లతో కూడిన బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు పారదర్శకంగా విధులు నిర్వహించాలని, ప్రజలు కోరిన సమాచారం నిర్ణీత సమయంలో అందించాలన్నారు.



మాట్లాడుతున్న ప్రధాన కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

జవాబుదారీతనం పెరిగింది

సమాచార హక్కు చట్టం కారణంగా ప్రభుత్వ పాలనలో పారదర్శకత జవాబుదారీతనం పెరిగిందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మండల స్థాయిలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ప్రతి కార్యాలయానికి వచ్చే ఆర్టీఐ దరఖాస్తుకు సకాలంలో సమాధానం అందించేలా అధికారులకు ఆదేశాలు అందించామన్నారు. సమాచార హక్కు చట్టం కమిషనర్లు దేశాల భూపాల్, పీవీ శ్రీనివాసరావు, అయోధ్యరెడ్డి, మొహసిన పర్వీన్‌లు మాట్లాడుతూ ఆర్టీఐ చట్టం ప్రజల్లో తీసుకుని వెళ్లేందుకు వారధులుగా ప్రభుత్వ అధికారులు సిబ్బంది పని చేయాలన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ అదనపు ఎస్పీలు చంద్రయ్య, శేషాద్రినిరెడ్డి, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాబాయి, జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల ఫస్ట్ అప్పీలేట్ అధికారులు, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-17 బాక్సింగ్, ఉషు పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో బుధ, గురువారాల్లో ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-17 బాలబాలికల బాక్సింగ్, ఉషు పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 8 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి వేణుగోపాల్, బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్ తెలిపారు. బుధవారం అండర్- 17 బాల బాలికల విభాగాల్లో బాక్సింగ్ పోటీలు, గురువారం ఉషు పోటీలను నిర్వహించనున్నామని తెలిపారు.

ఆసక్తి గల క్రీడాకారులు హెచ్‌డీఎఫ్ ఎలిజిబిలిటీ ఫాం, ఆధార్ కార్డు జిరాక్స్, బోనఫైడ్ సర్టిఫికెట్‌తో ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.

రామగుండం ఎన్టీపీసీకి రాజ్‌భాష జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎన్టీపీసీ ఏజీఎం విజయ్‌కుమార్ సిక్దర్

జ్యోతినగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీకి రాజ్‌భాష జాతీయ అవార్డు లభించింది. అధికారిక భాషా విధానం అమలులో విశేష కృషి చేసినందుకుగాను 2024-25 సంవత్సరానికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ రామగుండం ఎన్టీపీసీ రాజ్‌భాష కమిటీని జాతీయ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ మేరకు మంగళవారం గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్టీపీసీ ఏజీఎం(హెచ్ఆర్) విజయ్ కుమార్ సిక్దర్ అవార్డును అందుకున్నారు. ఎన్టీపీసీ ఈడీ చందన్‌కుమార్ సామంత నాయకత్వంలో హిందీ భాషను ప్రోత్సహించడం, ప్రచారం చేయడంలో రాజ్‌భాష కమిటీ అంకితభావంతో పని చేసిందని యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది.

ధర్మపురిలో ఘనంగా ఉట్టి వేడుకలు

ధర్మపురి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి):ధర్మపురి క్షేత్రంలోని ఇసుక స్తంభం వద్ద మంగళవారం ఉట్టి వేడుకలు నిర్వహించారు. స్వామి వారలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శెారితో ఇసుక స్తంభం వరకు వెళ్లి ఉట్టి కొట్టి వేడుకలు నిర్వ హించారు. కార్య క్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మం డలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, ధర్మ కర్తలు ఏదులాపురం మహేందర్, రాపర్తి సాయి కిరణ్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, రాజగోపాల్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ పాల్గొన్నారు. మంగళ వారం భక్తుల రద్దీ పెరిగింది. దీంతో లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



ఉట్టి వేడుకల్లో పాల్గొన్న అర్చకులు, సిబ్బంది



రేపటి నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్ కళాశాలల క్రీడలు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా జూనియర్ కళాశాలల అండర్-19 ఎస్‌జీఎఫ్ క్రీడల షెడ్యూల్‌ను మంగళవారం డీఐఈవో వి.గంగాధర్, పోటీల నిర్వహణ కార్యదర్శి జి.మధుజాన్సన్ ప్రకటించారు. ఈ పోటీలను ఉమ్మడి జిల్లాస్థాయిలో గురువారం నుంచి నవంబరు 7 వరకు నిర్వహించనున్నారు. మొత్తం 37 క్రీడాంశాలలో నిర్వహించే ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు అర్హత ఫారంతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, బోనఫైడ్ సర్టిఫికెట్, పదో తరగతి మెమో జిరాక్స్ కాపీలను జపరచాల్సి ఉంటుంది. ఈ పత్రాలపై కళాశాలల ప్రిన్సిపాల్ సంతకంతో హాజరుకావాలి. మంగళవారం నిర్వహించిన సమావేశంలో జిల్లాలోని వివిధ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్‌లు, సత్యవర్ధన్ రావు, ఆంజనేయరావు, రాజేశ్వరరావు, శశిధర్‌శర్మ, నిర్మల, వెంకటరమణాచారి, బల్వీందర్‌సింగ్ పాల్గొన్నారు.

క్రీడల షెడ్యూల్

జగిత్యాలలోని పొన్నాల గార్డెన్స్‌లో గురువారం బాలబాలికల విభాగంలో తై క్వాండో, కరాటే, బాక్సింగ్, తైక్వాండో మార్షల్ ఆర్ట్స్, 19న కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈటెక్నో ఉన్నత పాఠశాలలో బాల బాలికలకు చెస్, యోగాసన పోటీలు నిర్వహించనున్నారు. 20న కరీంనగర్ లోని అంబేద్కర్ స్టేడియంలో బాలురకు ఫుట్‌బాల్, అనంతరం అక్టోబరు 6న కొత్తపల్లి అల్ఫోర్స్ ఈటెక్నో పాఠశాలలో బాల బాలికలకు ఉషు, జూడో, 7న అల్ఫోర్స్ ఈటెక్నో పాఠశాలలో బాలురకు కబడ్డీ పోటీలు, 8న టీజీడబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాల చింతకుంటలో బాలికలకు కబడ్డీ, 9న తిమ్మాపూర్‌లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో బాలురకు వాలీబాల్, 10న టీజీడబ్ల్యూఆర్ఎస్ చింతకుంట జూనియర్ కళాశాలలో బాలికలకు వాలీబాల్, 13న కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో బాలబాలికలకు అథ్లెటిక్స్, 17న జగిత్యాలలోని మినీ స్టేడియంలో బాలబాలికలకు క్రికెట్, 18న కొత్తపల్లి అల్ఫోర్స్ ఈటెక్నోలో బాలబాలికలకు నెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, 23న గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో బాల బాలికలకు వెయిట్ లిఫ్టింగ్, స్కేటింగ్ పోటీలు ఉంటాయి.

24న కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో బాలురకు ఖో-ఖో, 25న అంబేద్కర్ స్టేడియంలో బాలికలకు ఖో-ఖో, 26న కొత్తపల్లి తేజస్ జూనియర్ కళాశాలలో బాల బాలికలకు బాస్కెట్ బాల్, 28న జగిత్యాల మినీ స్టేడియంలో బాలబాలికలకు ఫెన్సింగ్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, 29న కొత్తపల్లి అల్ఫోర్స్ ఈటెక్నోలో బాలబాలికలకు స్విమ్మింగ్, 31న కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో బాలబాలికలకు హాకీ, నవంబరు 4న కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో బాలబాలికలకు సైక్లింగ్, 6న కొత్తపల్లి తేజస్ జూనియర్ కళాశాలలో బాలబాలికలకు ఆర్చరీ, 7న జగిత్యాల మినీ స్టేడియంలో బాలబాలికలకు రగ్బీ పోటీలు, జగిత్యాల క్లబ్‌లో బాలబాలికలకు షటిల్ బ్యాడ్మింటన్, షూటింగ్, జగిత్యాల మినీ స్టేడియంలో బాలబాలికలకు ఫుట్‌బాల్ పోటీలను నిర్వహిస్తారు.



పరవళ్లు తొక్కుతున్న ఎగువ మానేరు

గంభీరావుపేట మండలం నర్మాల మానేరు ప్రాజెక్టు మళ్లీ పరవళ్లు తొక్కుతోంది. రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు కూడవెల్లి, పల్వంచ వాగులు పొంగుతున్నాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మానేరు జలాశయానికి వరద నీరు భారీగా వస్తోంది. ఎగువ మానేరు మత్తడి మీదుగా పరవళ్లు తొక్కుతోంది. దీంతో మానేరు వాగు బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తుండటంతో సిద్దిపేట-కామారెడ్డి మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి.

- గంభీరావుపేట, ఆంధ్రజ్యోతి


సామాన్యులు సైతం సాయుధులై..

(5వ పేజీ తరువాయి)

ప్రయత్నం చేయగా స్వచ్ఛందగా ఉద్యోగానికి రాజీనామా చేసి పోరాటాన్ని ముందుకు నడిపించారు.

ఉద్యమానికి ఊపిరినిచ్చిన ఆంధ్రమహాసభ..

తెలంగాణ సాయుధ పోరాటానికి సిరిసిల్లలో జరిగిన ఆంధ్రమహాసభ ఊపిరినిచ్చింది. నాలుగవ మహాసభ 1935లో మాడపాటి హన్మంతరావు అధ్యక్షతన సిరిసిల్లలో భీమకవి నగరంగా జరిగింది. 1944లో నల్గొండ జిల్లా భువనగిరిలో జరిగిన ఆంధ్రమహాసభ తరువాత కాంగ్రెస్ వాదులు, కమ్యూనిస్టులకు మధ్య విభేదాలు చోటు చేసుకున్నాయి. గాలిపల్లికి చెందిన బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి తదితరులు కమ్యూనిస్టు ఉద్యమం వైపు వెళ్లారు. దీంతో రైతాంగ పోరాటాలు మరింత ఊపునందుకున్నాయి. ఈ ఉద్యమంలో 1947లో ఇల్లంతకుంట మండలం గాలిపల్లి కేంద్రంగా ఉద్యమకారులు ఆయుధాలను సమకూర్చుకుంటున్నారని, గ్రామ ప్రజలు ఉద్యమం వైపు వెళుతున్నారని నిజాం సర్కార్ 300 మంది పోలీసులతో క్యాంప్‌ను ఏర్పాటు చేసింది. గాలిపల్లివాసులు పోలీసుల చర్యను తీవ్రంగా ప్రతిఘటించగా, పోలీసులు జరిపిన కాల్పులకు 14మంది నేలరాలారు. దీంతో గ్రామస్థులు పోలీస్ క్యాంప్‌పై దాడి చేసి ఎస్ఐతోపాటు ఆరుగురిని చంపారు. ఇదే సమయంలో గర్జనపల్లి, కోనరావుపేట, శివంగాలపల్లి పోలీసు క్యాంప్‌లపై కూడా దాడులు జరిగాయి. ఈ నేపథ్యంలో 1950 జూన్ 10న గెరిల్లాలు సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌పై దాడి జరిపి ఆరు తుపాకులు, రెండు 12బోర్ తుపాకులను ఎత్తుకెళ్లారు. స్వాతంత్రోద్యమం, నిజాం వ్యతిరేక పోరాటంలో మహిళలు తుపాకులు పట్టి ఉద్యమ బాటలో నడిచారు. దానికి



మానాల అడవుల్లో గెరిల్లా సైన్యం(ఫైల్)

ఆంధ్ర మహిళా సభ స్ఫూర్తిని ఇచ్చింది. 1935లో సిరిసిల్లలో ఆంధ్రమహిళా సభను మాడపాటి మాణిక్యమ్మ అధ్యక్షతన జరిగింది. సభలో యెల్ల ప్రగడ సీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

గెరిల్లాల శిక్షణ కేంద్రం మానాల..

నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరు నుంచి మొన్నటి వరకు మావోయిస్టుల దళాలకు ఆశ్రయం ఇచ్చి ఉద్యమ స్ఫూర్తిని మానాల చాటుకుంటుంది. ఆసియా కండంలోని పీపుల్స్‌వార్ నిర్మించిన తొలి మహిళా స్తూపం మానాల పోరాటాల జ్ఞాపకాలను గుర్తుచేస్తుంది. సిరిసిల్ల డివిజన్ సరిహద్దులో ఉన్న మానాల గిరిజన ప్రాంతం ఎంతో మంది వీరులను తీర్చిద్దింది. ఆ ప్రాంతం తెలంగాణ పోరాటయోధులకు శిక్షణ జోన్‌గా ఉండేది. సిరిసిల్లకు చెందిన అమృత్‌లాల్‌శుక్లా, బద్దం ఎల్లారెడ్డిల నాయకత్వంలో కార్యకర్తలకు ఆ అరణ్యం గాయిది గుట్ట శిక్షణా కేంద్రంగా ఉండేది. కమ్యూనిస్టు గెరిల్లాకు ఆ గ్రామ భూస్వామి రాజిరెడ్డి భోజనాలు సరఫరా చేసేవారు. ఎంతో నమ్మకంగా మానాల స్థావరం ఉండేది. మానాలలో గెరిల్లాలు శిక్షణ పొందుతుండగా... వంద మంది నిజాం సర్కారు పోలీసులు నిర్బంధించి రుద్రంగి క్యాంపునకు గెరిల్లాలను తరలించారు. ఆ తరువాత పలువురిని మానాల అడవుల్లోకి తీసుకువెళ్లి తుపాకులతో కాల్చి చంపారు. ఇలా గెరిల్లా యోధులకు ఆనాడు అండగా నిలిస్తే... ఆ పోరాట స్ఫూర్తి నక్సల్ ఉద్యమంలో కూడా మానాలనే కేంద్రంగా మారింది.

పోరాటాల పురిటి గడ్డ.. గాలిపల్లి..

ప్రపంచ చరిత్రలో తెలంగాణ సాయుధ పోరాటానికి మహోన్నత స్థానం ఉంది. జిల్లాలోని గాలిపల్లి తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం సర్కార్‌కు ఎదురొడ్డి తుపాకులు చేతబూని నిలిచింది. మహాత్మా గాంధీ పిలుపునందుకొని బద్దం ఎల్లారెడ్డి పోరాటంలో ముందుకు సాగారు. గాలిపల్లిలో బద్దం ఎల్లారెడ్డితో పాటు గెరిల్లా దళనాయకుడు అమృత్‌లాల్ శుక్లా, ఉద్యమకారులు, దళ నాయకులు తలదాచుకుంటున్నారని కలెక్టర్‌తో కలిసి పోలీసు బలగాలు చుట్టుముట్టాయి. పోలీసుల తీరుకు గాలిపల్లి వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు కాల్పులు చోటు చేసుకున్నాయి. పోలీసుల కాల్పుల్లో 14 మంది మృతిచెందారు. ఇలా తెలంగాణ సాయుధ పోరాటంలో ముఖ్యభూమికను పోషించిన గాలిపల్లి గ్రామ ప్రజలు ఇప్పటికి ఆ జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటున్నారు.

వివాహితను వేధిస్తున్న బాలుడిపై కేసు

చందుర్తి సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వివాహితను లైంగికంగా వేధిస్తున్న ఓ బాలుడిపై చందుర్తి పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. చందుర్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత(35)పై ఇదే గ్రామానికి చెందిన ఓ బాలుడు లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. మహిళ భర్త కొన్నేళ్ల క్రితం మృతిచెందగా ఒంటరిగా ఉంటోంది. గతనెల 23న రాత్రి 8.30 సమయంలో బాలుడు ఆమె ఇంటిలోకి వెళ్లి వేధింపులకు గురిచేశాడు. తిరిగి ఈనెల 13న రాత్రి వివాహిత ఇంటికి వెళ్లి బాలుడు తలుపు కొట్టడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేయడంతో వెళ్లిపోయాడు. బాలుడి చేష్టలకు విసిగిపోయిన వివాహిత కుటుంబ సభ్యులు అతడిపై దాడి చేశారు. ఈ విషయమై బాలుడి తరఫు వారు పోలీసులను ఆశ్రయించగా, ఈ విషయమంతా బయటకు పొక్కింది. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు బాలుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

తండాల్లో బోరు బావుల తవ్వకాలు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలం జవహర్‌లాల్‌నాయక్ తండా, భంగిరెడ్డితండాలోని సేవాలాల్ మహారాజ్ ఆలయాల్లో బోరు బావుల తవ్వకాలను మంగళవారం తండాపెద్దలు ప్రారంభించారు. అజ్మీరా నవీన్‌నాయక్, చిగుళ్ల తిరుపతి, మహేశ్‌లు నీటి వసతి కల్పించేందుకు ముందుకు వచ్చారు. యువకులను తండా పెద్దలు అభినందించారు.

పీఆర్‌సీ ప్రకటించాలి

చందుర్తి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పీఆర్‌సీ ప్రకటించి, ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులకు టెట్ మినహాయించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు దుమాల రమానాథ్‌రెడ్డి అన్నారు. టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో పాఠశాలలో సమస్యల సేకరణలో భాగంగా చందుర్తి మండలంలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా దుమాల రమానాథ్‌రెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 5డీఏలు ప్రకటించాలన్నారు. 317బాధితులకు న్యాయం చేస్తామని చెబుతున్న ప్రభుత్వం న్యాయం చేయకుండా వారిని ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్కుర్తి అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మందాడి శ్రీనివాస్‌రెడ్డి, ఎడ్ల కృష్ణ చైతన్య, మండల అధ్యక్షులు తాటికొండ సంజీవ్, ప్రధాన కార్యదర్శి కొత్తూరు శ్రీధర్‌ల, బాధ్యులు పాము వెంకట్, కర్ర శ్రీధర్, రాచకొండ ప్రసాద్‌లు పాల్గొన్నారు.

22 నుంచి కేవీపీఎస్ జిల్లా మహాసభలు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని చేనేత వస్త్ర వ్యాపారం సంఘం భవనంలో ఈనెల 22, 23 తేదీల్లో జరగనున్న కేవీపీఎస్ జిల్లా ద్వితీయ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి ఎరవెల్లి నాగరాజు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) సామాజిక ఉద్యమ ప్రస్థానంలో 28 వసంతంలోకి ప్రవేశిస్తుందన్నారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్‌బాబు, రాష్ట్ర సహాయ కార్యదర్శి తిప్పారపు సురేష్ పాల్గొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూడుకాల గిరిబాబు, రాజు, వెంకటేశ్, నరేందర్, మోహన్, వినోద్ పాల్గొన్నారు.

నగదు రహిత లావాదేవీలపై అవగాహన

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహిళలు నగదు రహిత లావాదేవీలను నిర్వహించాలని డీపీఎం పద్మయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కావేరి గ్రామైఖ్య మండల కార్యాలయ భవనంలో నగదు రహిత లావాదేవీలపై మహిళలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం నర్సయ్య, సీసీ పద్మ, సీఆర్పీలు జ్యోతి, చామంతి, గ్రామైఖ్య సంఘం అధ్యక్షురాలు ప్రమీల, వీవోఏ శోభ, సభ్యులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల ధర్నా



మామిడిపల్లిలో ధర్నా చేస్తున్న రైతులు

కోనరావుపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం రైతులు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామ రైతులు ప్రధాన రహదారిపై బైఠాయించి యూరియా సరఫరా చేయాలని ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ యూరియా కొరత వల్ల ఇబ్బంది పడుతున్నామన్నారు. సరైన సమయంలో యూరియా వాడకపోతే దిగుబడి తగ్గిపోతుందని అన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులు కావాల్సిన యూరియా సరఫరా చేయాలని కోరారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది..

ఇల్లంతకుంట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ వృత్తి గౌరవ ప్రదమైనదని మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని కందికట్కూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా నిలిచిన కూస మల్లారెడ్డిని సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబద్ధతతో పనిచేస్తే సరైన గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఇల్లంతకుంట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసన్నపల్లె గ్రామంలో గాలిపెల్లి పల్లె దవాఖాన ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం కొనసాగింది. గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 64మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా జ్వరలక్షణాలు ఉన్న నలుగురికి ఆర్‌డీటీ మలేరియా పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి కట్ట రమేష్, సిబ్బంది కవిత, రుజన, లక్ష్మి, సరిత తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

కోనరావుపేట సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిజామాబాదులో నాటుసారా విక్రేత ఇంటిపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. తాళ్లపెల్లి లచ్చయ్య లచ్చపేటతండా చెందిన గుగులోతు ప్రమీల అనే మహిళ వద్దనాటు సారాను తక్కువ ధరకి కొనుగోలు చేస్తూ గ్రామ ప్రజలకు అధిక ధరకు విక్రయం చేస్తున్నాడని కచ్చితమైన సమాచారం అందింది. ఎస్సై ప్రశాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏఎస్ఐ ఎం.లక్ష్మణ్ పోలీసులతో కలిసి మంగళవారం లచ్చయ్య ఇంటిపై దాడి చేసి 5లీటర్లు నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తాళ్లపెల్లి లచ్చయ్య, గుగులోతు ప్రమీలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

ముస్తాబాద్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని సేవలాల్ తండాకు చెందిన భూక్యా శంకర్ నాయక్ (55) అనే వ్యక్తి అప్పుల బాధతో మానసిక స్థితి లోపించి పొలం వద్దకు వెళ్లి ఊరేసుకున్న సంఘటన చోటు చోటు చేసుకుందని ఎస్సై గణేశ్ మంగళవారం తెలిపారు. ఇల్లు కట్టుకోవడానికి రూ. 5 లక్షలు అప్పు చేయగా వాటిని తీర్చే మార్గం లేక మానసికంగా కృంగిపోయాడు. మృతుని కొడుకు భూక్య గంగారాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

రైతుల వివరాలతో యాప్ సిద్ధం చేయాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతుల వివరాలతో యాప్ సిద్ధం చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో వ్యవసాయ,ఉద్యానవన శాఖలపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అందరూ రైతుల పూర్తి వివరాలు ఎన్ని ఎకరాలు ఉంది, ఆధార్ నెంబర్, గ్రామం, మండలం, పట్టాదార్ పాస్ బుక్ నెంబర్ తదితర వివరాలతో అప్లికేషన్ సిద్ధం చేయాలని సూచించారు. దీంతో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలు, క్రాప్ బుకింగ్, ఎంత యూరియా తీసుకున్నారో వివరాలు ఉండాలని స్పష్టం చేశారు. ఏ రైతు జిల్లాలో ఎక్కడ కొనుగోలు చేసినా ఆ వివరాలు నమోదు కావాలని సూచించారు. జిల్లాకు ఎన్ని మెట్రిక్ టన్నుల యూరియా అవసరం, ఇప్పటి వరకు ఎంత వచ్చిందో ఆరా తీశారు. 23 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని, ఇప్పటి వరకు 18 వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, మిగతా యూరియా పంటల సాగుకు అనుగుణంగా అందుబాటులో ఉంటుందని కలెక్టర్ దృష్టికి జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం తీసుకెళ్లారు. జిల్లాలో ఎరువులకు కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు.

లక్ష్యానికి అనుగుణంగా పని చేయాలి

ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యానికి అనుగుణంగా ఆయిల్ పామ్ సాగును చేసేందుకు ఉద్యానవన శాఖ అధికారులు, సిబ్బంది పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రెండు వేల ఎకరాలలో ఆయిల్ ఫామ్ పంట సాగు విస్తీర్ణం లక్ష్యం కాగా, ఇప్పటివరకు 1172 ఎకరాల్లో 339 మంది రైతులు ఆయిల్ పామ్ సాగుకు ఆసక్తి చూపించారని, 126 ఎకరాలలో ప్లాంటేషన్ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుకు ఆసక్తిగా ఉన్న రైతుల రిజిస్ట్రేషన్, పరిపాలన మంజూరు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఆయిల్ పామ్ ప్లాంటేషన్ వేగవంతం చేయాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగుకు ఆసక్తి చూపుతున్న రైతుల వద్ద నుంచి మొక్కలు, డ్రిప్ ఏర్పాటుకు రైతుల వాటా డీడీలను సేకరించి సంబంధిత ఏజెన్సీల ద్వారా డ్రిప్ సౌకర్యం సత్వరమే అందేలా చూడాలని, నిర్దేశిత లక్ష్యం ప్రకారం ఆయిల్‌పామ్ సాగు ప్లాంటేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు 37.5 టన్నులు హార్వెస్టింగ్ చేశారని, టన్ను రూ 19107 పైగా ధర లభించిందని, పంట దిగుబడి వస్తున్న రైతుల అనుభవాలను కొత్త రైతులకు తెలియజేయాలని పేర్కొన్నారు. కంపెనీ వారు వచ్చి ఆయిల్ పామ్ ఉత్పత్తులు సేకరిస్తారని, వారం రోజుల్లో రైతుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని వెల్లడించారు. లాభసాటి ఆయిల్ పామ్ పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆయిల్‌పామ్ పంట సంబంధించి రైతులు సలహాలు, సూచనలు అందించేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 9398684240కు తెలియజేయాలని, పంట లాభం పై అధిక ప్రచారం కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారి లత, వ్యవసాయ అధికారులు, హార్టికల్చర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేక శిబిరాలు : కలెక్టర్

సిరిసిల్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి):మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ప్రతిరోజు ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో స్వస్త్ నారీ, సాశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంపై అధికారులతో సమావేశం నిర్వహించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వస్త్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం జిల్లాలో కట్టుదిట్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్‌సెంటర్, ఏరియా హాస్పిటల్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, బస్తీ దవఖానాల్లో ప్రత్యేక వైద్య నిపుణులతో ఆరోగ్య పరీక్షలు జరిపించాలని అన్నారు. మహిళల్లో ఎక్కువగా కనిపించే రక్తహీనత, డయాబెటిస్, రక్తపోటు సమస్యలపై ప్రత్యేక పరీక్షలు సలహాలు అందించాలన్నారు. మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ప్రతి రోజూ ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలని, విద్యాశాఖ అధికారి, సంక్షేమ శాఖ అధికారి, ఇంటర్మీడియట్ అధికారుల సహకారంతో ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులలోని బాలికలందరికీ స్పెషల్ క్యాంప్ ఏర్పాటు చేసి వైద్యుల ద్వారా అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ఆరోగ్య పరీక్షలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి అవసరమైన వారికి ఆరోగ్య శిబిరాలకు తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారి, సంక్షేమ శాఖ అధికారి సమన్వయంతో పని చేస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. రక్తహీనత, డయాబెటిస్, బ్రెస్ట్, క్యాన్సర్, సర్వికల్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్, అనీమియా, టీబీ వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరుగుతాయన్నారు. గైనకాలజిస్ట్, ఇయర్స్, డెర్మటాలజిస్ట్, డెంటల్ సర్జన్ వంటి ప్రత్యేక వైద్యుల సేవలను వినియోగించుకోవాలన్నారు. జిల్లాలోని ప్రతి గర్భిణీ 100శాతం ఏఎన్‌పీ చెకప్ చేయించుకునేలా చూడాలని, పిల్లలకు అవసరమైన ఇమ్యునైజేషన్ డోసులు సకాలంలో అందించాలన్నారు. టీబీ నియంత్రణకు నిక్షయ మిత్ర ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాలని అన్నారు. కలెక్టరేట్‌లో మెగా బ్లడ్ డొనేషన్ క్యాంపులు ఏర్పాటు చేయాలని రక్తదానంపై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత, డీఆర్‌డీవో శేషాద్రి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, డీపీవో షరీఫ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విమోచన దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

- బీజేపీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు

వేములవాడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ విమోచన దినోవాన్ని విజయవంతం చేయాలని బీజేపీ సీనియర్ నేత చెన్నమనేని వికాస్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన వేములవాడలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకపోవడం చాలా బాధాకరమని అన్నారు. సెప్టెంబరు 17వ తేదీని తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తున్నదని గుర్తుచేశారు. కేంద్ర మాజీ మంత్రి చెన్నమనేని విద్యాసాగర్‌రావు తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహణ కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. బీజేపీ తరఫున తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. వేములవాడ పట్టణంలో బుధవారం జెండా ఆవిష్కరణతో పాటు రక్తదాన శిబిరం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు బండ మల్లేశం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అల్లాడి రమేష్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు మార్త సత్తయ్య, మాజీ జడ్పీటీసీ అన్నపూర్ణ, జిల్లా కార్యదర్శి సురేందర్‌రావు, వేములవాడ టౌన్ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్, అర్బన్ మండల అధ్యక్షుడు శేఖర్, రూరల్ మండల అధ్యక్షుడు పరమేష్, చందుర్తి మండల అధ్యక్షుడు విజేందర్, కోనరావుపేట మండల అధ్యక్షుడు బాలాజీ, రుద్రంగి మండల అధ్యక్షుడు వేణు, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు సంటి మహేష్, జిల్లా కౌన్సిల్ మెంబర్ కృష్ణ స్వామి, రాకేష్, గొట్టె రాంచందర్, నాయకులు లింగంపల్లి శంకర్, రాజిరెడ్డి, మాజీ కౌన్సిలర్ సంతోష్ బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వేములవాడలో విలేకరులతో మాట్లాడుతున్న చెన్నమనేని వికాస్

మొక్కజొన్నలో కలుపు యాజమాన్యంపై శిక్షణ

ఇల్లంతకుంట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : మొక్కజొన్నలో లింగాకర్షక బుట్టల ద్వారా కత్తెరపురుగును నివారించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త రజనీకాంత్ పేర్కొన్నారు. గాలిపెల్లి గ్రామంలోని రైతు వేదికలో మంగళవారం మొక్కజొన్నలో కలుపు యాజమాన్యంపై రైతులకు అవగాహన సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న పంట విత్తిన 45రోజుల లోపు కలుపు ఉధృతి లేకుండా చూసుకున్నట్లయితే అధిక దిగుబడులు వస్తాయన్నారు. అనంతరం వివిధ గ్రామాలలోని మొక్కజొన్న, వరిపంటను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు రాంప్రసాద్, హరికృష్ణ, మదన్‌మోహన్‌రెడ్డి, వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి, ఏఈఓ అర్చన పాల్గొన్నారు.

వర్గీకరణతో మాలలకు నష్టం..

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణతో మాలలు తీవ్రంగా నష్టపోతున్నారని రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి వర్గీకరణ చట్టాన్ని సవరించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మాల మహానాడు జిల్లా స్థాయి సమావేశం జరిగింది. సుధాకర్ మాట్లాడుతూ వర్గీకరణ చట్టాన్ని ప్రభుత్వం సవరించాలన్నారు. అనంతరం జిల్లా కమిటీని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు నీరటి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ మంగ కిరణ్, ఉపాధ్యక్షులు మూల కిషోర్, వంకాయల మహేష్, ప్రధాన కార్యదర్శి గూడ బాబు, సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల ఇన్‌చార్జీలుగా ఎడ్ల రాజ్‌కుమార్, బత్తుల కమలాకర్‌లను ఎన్నుకున్నారు.

'ఆర్టీఐ కార్యకర్తలకు బెదిరింపులు'

సిరిసిల్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అధికారులు సమయానికి సమాచారం ఇవ్వకపోగా అవహేళన చేస్తూ సమాచార హక్కు చట్ట కార్యకర్తలను బెదిరిస్తున్నారని తెలంగాణ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకల కమలాకర్, ప్రధాన కార్యదర్శి గుడిసె ప్రభాకర్, గొల్లపల్లి డేవిడ్‌లు మంగళవారం కలెక్టరేట్‌కు వచ్చిన రాష్ట్ర సమాచార కమిషన్‌కు వినతిపత్రం అందించారు. సమాచారాన్ని సకాలంలో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు

కోనరావుపేట, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువుల్లోకి సమృద్ధిగా నీరు చేరుతున్నాయి. కనగర్తి పాఠశాలలోకి నీరు చేరడంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. మండలంలో వర్షాకాలం ప్రారంభం నుంచి సమృద్ధిగా వర్షాలు పడకపోవడంతో రైతులు నిరాశతో ఉన్నారు. ఖరీఫ్ పంటలు ఎలా కాపాడుకోవాలో తెలియని పరిస్థితుల్లో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువుల్లోకి నీరు చేరుతున్నాయి. దీంతో మండల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కనగర్తి పాఠశాలలోకి నీరు చేరడంతో పాఠశాల లోపలికి వెళ్లడానికి ఇబ్బందిపడుతున్నారు. పాఠశాలలోకి నీరు రాకుండా అధికారులు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

హిందీ భాషతో జాతీయ సమైక్యత పెంపు

చందుర్తి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హిందీ భాష జాతీయ సమైక్యతను పెంపొందిస్తుందని ప్రధానోపాధ్యాయుడు జితేందర్ అన్నారు. చందుర్తి మండలం నర్సింగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం హిందీ దివాస్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, డ్రాయింగ్, మోడల్ మేకింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. హిందీ ఉపాధ్యాయులు ఈగ శ్రీనివాస్ ఉపాధ్యాయులు బాల్‌రెడ్డి, గుండబోయిన శ్రీనివాస్, లక్ష్మణ్, పావని, మహేష్, బన్నాజీ, మంద శ్రీనివాస్, కార్తీక్, సాగర్, అశోక్ పాల్గొన్నారు.

ఏకలవ్య గురుకులం పారిశుధ్య పనులు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



గురుకులం ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న పంచాయతీ కార్మికులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని ఏకలవ్య గురుకులం పాఠశాలలోని సమస్యల పట్ల సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. గురుకులంలో నెలకొన్న సమస్యలతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై ఈనెల 15న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఏకలవ్య గురుకులం.. సమస్యమయం' అనే కథనానికి పాఠశాల అధికారులు, పంచాయతీ కార్యదర్శి మహేందర్ మంగళవారం స్పందించారు. క్షేత్రస్థాయిలో పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి మహేందర్ పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను కార్మికులతో తొలగించారు. భవనాలు, తరగతి గదుల చుట్టూ శుభ్రం చేయించారు. పాఠశాలలో ధ్వంసమైన తరగతి గదుల కిటికీలకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

గిరిజన విద్యార్థికి పీహెచ్‌డీ పట్టా

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మారుమూల అటవీ ప్రాంతంలోని వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామంలోని గిరిజన యువకుడు భూక్య మోహన్‌బాబు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. గ్రామంలోని భూక్య మేనీభాయి-కిషన్‌నాయక్ దంపతుల కొడుకు మోహన్‌బాబు హైదరాబాద్‌లోని ఓ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ సంధ్య పర్యవేక్షణలో 'టెంపోరల్ అండ్ స్పేషియల్ అనాలిసిస్ ఆఫ్ ఈసీజీ ఫర్ అరిథ్మియా డిటెక్షన్ యూజింగ్ డీప్ లెర్నింగ్' అనే అంశంపై పరిశోధన చేశారు.

జిల్లా స్థాయి ప్రతిభాపాటవ పోటీలకు ఎంపిక

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి ప్రతిభా పాటవ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం మురళీధర్ మంగళవారం పేర్కొన్నారు. వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి వ్యాసరచన, చర్చపోటీల్లో విద్యార్థులు త్రిపుర, చేతన, సాయిసహస్ర, త్రివేణ్ రెడ్డి, సహస్రలు ప్రతిభ కనబర్చారని తెలిపారు.


నియామకం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి) : యాదవ హక్కుల పోరాటసమితి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన మానుక నాగరాజుయాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కు దేవేందర్‌యాదవ్ మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు. యాదవుల హక్కుల సాధనకు తన వంతు కృషి చేస్తానని నాగరాజుయాదవ్ పేర్కొన్నారు. నాయకులు సురేశ్‌యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, శేఖర్ యాదవ్, ప్రశాంతియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గోడ నిర్మాణంలో నిర్లక్ష్యం తగదు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరైన పనులు చేయడంలో నిర్లక్ష్యం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు మంగళవారం పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులను కేటాయించడంతో పనులకు భూమి పూజ చేసి నెలలు గడుస్తున్నా నేటికి ప్రారంభించలేదని అన్నారు. పశువులు, వాహనాలు రాకపోకలు సాగిస్తుండడం వల్ల పాఠశాల విద్యార్థుల బోధనకు ఆటంకంగా మారుతోందని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి పనులను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రశాంత్, శంకర్, కనకయ్య, నరేందర్, నాగరాజు తదితరులు ఉన్నారు.

జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్



శ్రీనివాస్

చందుర్తి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జాతీయ మాల మహానాడు రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షునిగా చందుర్తి మండలం మూడపల్లి గ్రామం చెందిన నీరటి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో జాతీయ మాల మహానాడు రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీని ఏకగ్రీవంగా మం గళవారం ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శి గూడ బాబు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంగ కిరణ్, ఉపాధ్యక్షులు మూలే కిషోర్ ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి మేడి అంజయ్య, రాష్ట్ర సంస్కృతిక కన్వీనర్ ఎలుక దేవయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాలుక సత్యం,రాష్ట్ర కార్యదర్శి రొడ్డ రాంచంద్రం, నాయకులు ఎడ్ల రాజ్ కుమార్, బత్తుల కమలాకర్, తుంగ. శివరాజ్, జిల్లాలోని మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కోనరావుపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పేకాటరాయలను అరెస్టు చేసినట్లు కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి మంగళవారం తెలిపారు. కోనరావు పేట మండలం కనగర్తి గ్రామ శివారులో ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని కచ్చితమైన సమాచారం అందింది. దీంతో పోలీసులు కనగర్తి గ్రామం చేరుకొని పేకాట స్థావరం దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.8070 నగదు, 4స్మార్ట్ ఫోన్లు, 3ద్విచక్ర వాహనాల్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

ఇల్లంతకుంట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్ కుమార్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. సమావేశంలో నాయకులు కొలనూరి ముత్తక్క, మ్యాకల మల్లేశం, నాగసముద్రాల సంతోష్, పినకాసి అనీల్, తుమ్మనపల్లి కమలాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.